
ఈనాడు
ఆదివారం
20 ఆగస్టు 2023



గ్రాఫీన్...
రేపటి ప్రపంచం దీనిదే!

అమ్మతో గొడవైతే నాన్నకి ఫోన్ చేసేదాన్ని!

ఈశా అంబానీ పిరామల్... అపరకుబేరుడైన ముకేశ్ అంబానీ తనయగా, యువ వ్యాపారవేత్తగా ఈమెకు ఉన్న గుర్తింపు అంతా ఇంతా కాదు. రిలయన్స్ రీటైల్ పగ్గాలు చేపట్టిన తక్కువ సమయంలోనే సంస్థ లాభాలను పెంచుతూ తండ్రికి తగ్గ కూతురిగా పేరు తెచ్చుకున్న ఈశా... తనకు సంబంధించిన విషయాలను పంచుకుంటోందిలా...





టామ్‌బాయ్‌లా పెరిగా

మా కుటుంబంలో నేనొక్కదాన్నే అమ్మాయిని కావడంతో కాస్త ఎక్కువగానే అల్లరి చేసేదాన్ని. ఇంట్లో నాకు ఎలాంటి ఆంక్షలు పెట్టకపోగా, నన్ను ఆకాశ్ - అనంత్‌లతో సమానంగా అన్నింట్లోనూ ప్రోత్సహించారు. వాళ్లు చేయగలిగిన పనులన్నీ నేనూ చేసేదాన్ని. నాకు నచ్చినట్లుగానే యేల్ యూనివర్శిటీలో సైకాలజీ, స్టాన్‌ఫర్డ్ నుంచి ఎంబీఏ పూర్తిచేశా. ఆ తరువాత ఓ సంస్థలో పనిచేశాకే రిలయన్స్‌లోకి వచ్చా.

నాన్నే మాకు మధ్యవర్తి

మహిళలకు గ్లాస్‌సీలింగ్ అనేది లేదనీ... ఆత్మవిశ్వాసం, ధైర్యం ఉండి.. కష్టపడేతత్వాన్ని అలవర్చుకుంటే ఏదయినా సాధించొచ్చనీ నాన్న నా చిన్నప్పటినుంచీ చెప్పేవారు. అలాగే డబ్బు విలువనూ తెలుసుకోమనేవారు, అందరినీ సమానంగా చూడమనేవారు. వాటన్నింటినీ నేను ఇప్పుడు ఆచరణలో పెడుతున్నా. మా చిన్నప్పుడు... నాన్న ఎంత బిజీగా ఉన్నా నాకూ అమ్మకూ ఏ విషయంలోనైనా వాదన జరిగితే వెంటనే నాన్నకు ఫోన్ చేసేదాన్ని. అంత బిజీలోనూ నాన్న మధ్యవర్తిగా మారిపోయి మా సమస్యని పరిష్కరించేవారు.

సౌకర్యానికే ప్రాధాన్యం

దుస్తుల విషయంలో నేను సౌకర్యానికే ప్రాధాన్యం ఇస్తా. ఆఫీసుకు వెళ్తున్నప్పుడు బ్లేజర్ కాకుండా కుర్తాలు వేసుకునేందుకే ఇష్టపడతా. పార్టీలూ, వేడుకలను బట్టి.. సందర్భానుసారంగా దుస్తుల్ని ఎంచుకుంటా.

★ పియానో వాయించడం, పుస్తకాలు చదవడం ఇష్టం.



భగవద్గీతను అర్థంచేసుకుంటున్నా...

ఆనంద్‌కు పార్టీలకీ, వేడుకలకీ రావడం పెద్దగా ఇష్టం ఉండదు. తనకు కొంచెం ఆధ్యాత్మిక ఆలోచనలూ ఎక్కువే. నేను ఎప్పుడైనా కాస్త ఒత్తిడిగానో లేదా హడావుడిగానో ఉన్నప్పుడు.. భగవద్గీతలోని శ్లోకాలను ఉదహరిస్తాడు. మంచి ఆలోచనలకూ, మంచి పనులకూ ప్రత్యామ్నాయాలు ఉండవని తరచూ చెబుతుంటాడు. ఆనంద్‌తో పెళ్లయ్యాక గీతాసారాన్ని అర్థంచేసుకుంటూ ఆచరణలోనూ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నా.

అదే నా కోరిక

ఎప్పటికైనా సరే... ప్రపంచంలోని పది ప్రముఖ సంస్థల్లో మా రిలయన్స్ ఉండాలనేదే నా కోరిక. అదే విధంగా భవిష్యత్తులో ఎవరైనా నా గురించి ప్రస్తావించాల్సి వచ్చినప్పుడు... 'తల్లిదండ్రుల సంపదను వృద్ధి చేసి వారి ఆశయాల్నీ, విలువల వారసత్వాన్నీ ముందుకు తీసుకెళ్లింద'ంటూ చెప్పగలగాలి. ఆ రెండూ జరిగిన రోజున... నా కల నిజమైందని భావిస్తా.



అమ్మే ఆదర్శం

అమ్మ ఎంత స్ట్రిక్ట్ అయినా నేను ఎదిగేకొద్దీ నాతో... 'మనిద్దరం బెస్ట్ ఫ్రెండ్స్' అని తరచూ చెప్పేది. దాంతో ప్రతి సంవత్సరం నా పుట్టినరోజు పార్టీ లిస్ట్‌లో అమ్మ పేరే మొదట రాసుకునేదాన్ని. మేం పుట్టినప్పుడు ఇంటికి పూర్తి సమయం కేటాయించిన అమ్మ మేం కాస్త పెద్దయ్యాక ఎన్నో పనుల్ని పూర్తి చేయడం చూస్తే ఆశ్చర్యమేసేది. ఇప్పుడు నేనూ అమ్మలానే పిల్లల బాధ్యతల్నీ, ఆఫీసునూ బ్యాలెన్స్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నా.


KLVAJ06M114

లోపల

మంచిమాట

బిడ్డలు ఎంత ఎదిగినా ఏ స్థాయిలో ఉన్నా... మనసు కలత చెందినప్పుడు ముందుగా గుర్తొచ్చేది అమ్మే.

క్లిక్... క్లిక్...



ఇండోనేషియాలోని ఒరాంగుటాన్ సర్వైవల్ ఫౌండేషన్‌కి చెందిన సంరక్షకుడు పాముల్ని పట్టుకునేందుకు మడుగులోకి దిగితే... అతడు మునిగిపోతున్నాడేమో అనుకుని సాయం చేసేందుకు ఒరాంగుటాన్ చేయి అందిస్తోన్న దృశ్యాన్ని సందర్శకుడు అనిల్ ప్రభాకర్ తన కెమెరాలో బంధించారు. 'జంతువుల్లోనూ మానవత్వం దాగుంది' అనడానికి ఇంతకుమించిన నిదర్శనం ఏం ఉంటుందీ..!



సిల్లీపాయింట్

కెనడా, అమెరికాల్లో- భారతీయ యోగాకి సంబంధించి ఎప్పటికప్పుడు కొత్త రకాలని కనిపెడుతున్నారు. ఓ గది ఉష్ణోగ్రతని 42 డిగ్రీలూ, తేమని 40 శాతం పెంచి మరీ సాధన చేయించే హాట్ యోగా ఆ దేశాల్లో బాగా ఫేమస్. నట్టనడివేసవిలో మిట్టమధ్యాహ్నాన ఓ రోడ్డుపైన కూర్చుని చెమటలు కక్కుతూ యోగా చేసినట్టు ఉంటుందది!

★ ఇంగ్లండ్‌లో 'గోథమ్' అనే గ్రామం ఉంది. అక్కడి జానపద కథల ప్రకారం అది తెలివిలేనివాళ్ళ ఊరు! అమెరికా ఆర్థిక రాజధాని న్యూయార్క్ నగరాన్ని కూడా స్థానికులు 'గోథమ్' అనే ముద్దుగా పిలుస్తుంటారు!

★ మనుషులూ, కొన్ని కోతి జాతుల తర్వాత... అద్దంలో తన ముఖాన్ని గుర్తించగలిగే శక్తి డాల్ఫిన్‌లకే ఉంది.

★ అమెరికాలోని మిన్నెసోటా నగరంలో ఎలుకల్ని పట్టి... అక్కడి కార్పొరేషన్ ఆఫీస్‌కి తీసుకెళితే ప్రతి ఎలుకకీ పది సెంట్ల చొప్పున (సుమారు ఎనిమిది రూపాయలు) డబ్బులిస్తారు!

★ విమానంలో ప్రయాణించేటప్పుడు- పీడనం వల్ల మన నాలుక తీపినీ, ఉప్పునీ ఆస్వాదించే శక్తిని 30 శాతం కోల్పోతుందట. అందువల్లే చాలామందికి ఫ్లైట్‌లో పెట్టే ఆహారం రుచించదు!

★ ఒక్క భారతదేశంలోనే కాదు... చైనా, నేపాల్, పర్షియా, అరబ్ దేశాల్లోనూ హస్త సాముద్రికా శాస్త్రాన్ని నమ్ముతారు.

★ గూగుల్ మ్యాప్‌లోకి వెళ్ళి టాయ్‌లెట్ అని టైప్ చేసి చూడండి... మీకు దగ్గర్లో ఉన్న పబ్లిక్ టాయ్‌లెట్‌ల వివరాలన్నీ వచ్చేస్తాయి! 2016 నుంచి ప్రత్యేకంగా వాటిని తన మ్యాప్‌లో నమోదుచేస్తూ వస్తోంది గూగుల్!

★ ప్రపంచంలో అతి ప్రాచీన కాలం నుంచి స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకుంటున్న దేశం జపాన్. క్రీస్తు పూర్వం 660 నుంచీ అక్కడ ఈ వేడుకని జరుపుకుంటున్నారని చెబుతారు!

★ ఫిన్‌లాండ్ ప్రపంచంలోనే అతిపెద్ద కాఫీ ప్రియుల దేశం. రోజూ కనీసం తొమ్మిదిసార్లు కాఫీ తాగనిదే అక్కడివారికి పొద్దు గడవదట!

మనిషి ఎక్కువగా నవ్వేది 5-6 ఏళ్ళ వయసులో. ఆ వయసులోని చిన్నారులు పెద్దవాళ్ళకంటే మూడు రెట్లు ఎక్కువగా నవ్వుతారట.





మనుషుల తర్వాత కుక్కలూ గుర్రాలకే కంటి శుక్లాలు ఎక్కువగా వస్తాయి.

వజ్రాన్ని నిప్పుతో మండిస్తే ఏమీ మిగలదు... కనీసం బూడిద కూడా!






మన ఫోన్‌ని రోజులో సగటున 110 సార్లు అన్‌లాక్ చేస్తామట.



ఎలాన్ మస్క్ ట్విటర్ పేరుని X (ఎక్స్)గా మార్చిన విషయం తెలిసిందే! ఆయనకి ఆ అక్షరంపైన ఉన్న మమకారం నిన్నామొన్నటిది కాదు. మస్క్‌ని తొలిసారి సంపన్నుడిగా మార్చిన పే పాల్ (మన పేటీఎం లాంటిది) స్టార్టప్‌కి మొదట ఎక్స్.డాట్‌కామ్ అన్నదే పేరు. అంతెందుకు, తన కొడుక్కీ 'ఎక్స్ ఏఈ ఏ-12' అని పేరు పెట్టాడు... చిత్రంగా!



అమెరికాలోని సినిమా థియేటర్లలో సీట్లని ముందస్తుగా రిజర్వ్ చేసుకోవడానికి వీల్లేదు. హాలులోపలికి వెళ్ళాక మన పల్లె ప్రాంతాల్లోలా- ఎవరి వేగం, బలాన్ని బట్టివాళ్ళు సీటుని దక్కించుకోవాలి!



ఆలయాల్లో ప్రసాదాలు పెట్టడం, ప్రత్యేక పర్వదినాల్లో అన్నదానాలు చేయడం మామూలే. కానీ... ఈ అంజన్న ఆలయంలో మాత్రం ప్రతి సోమవారం పెద్ద ఎత్తున అన్నదానం జరుగుతుంది. ఆ రోజున ఊరి జనంతో కలిపి సుమారు పదివేలమంది భక్తులు అక్కడే భోజనంచేసి.. స్వామి సేవలో తరిస్తారు. గ్రామం మధ్యలో కొలువుదీరిన ఈ స్వామిని పూజిస్తే... అనుకున్న పనులు నెరవేరతాయని ఓ నమ్మకం.







సోమవారం ఆ ఊళ్లో వంట చేయరు!

చిన్న గ్రామంలో.. ఊరి మధ్యలో బహిరంగ ప్రదేశంలో ఓ పీఠంపైన కొలువుదీరి రోక్డేశ్వర్‌గా పూజలు అందుకుంటున్న ఈ హనుమంతుడికి ఆపదలను తొలగించే ఆపద్బాంధవుడని పేరు. స్వామి శుభదృష్టి పడితే కష్టాలు తొలగిపోతాయని నమ్మే భక్తులు... ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు చెప్పుల్లేకుండా కిలోమీటర్లకొద్దీ నడిచి మరీ వస్తారు. సాధారణంగా హనుమంతుడిని మంగళవారం లేదా శనివారం కొలిస్తే... ఇక్కడ మాత్రం సోమవారం పూజిస్తారు. ఆ రోజున నిర్వహించే అన్నదానాన్ని స్వీకరించేందుకు ఆ ఊరివాళ్లే కాదు... వివిధ ప్రాంతాల నుంచి ఎంతో మంది భక్తులు తరలివస్తారు. ఆ రోజున... ఇక్కడెవరూ వంటచేయరు సరికదా వ్యక్తిగత పనులనూ మానేసి స్వామి సేవలోనే తరిస్తారు. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న ఈ ఆలయం నిర్మల్ జిల్లా సరిహద్దు, మహారాష్ట్ర బిలోలి తాలూకా ధర్మాబాద్ సమీపంలోని పాటోదా(బి)లో ఉంది.

స్థలపురాణం

సుమారు అయిదువందల సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతంలో ఓ ఆలయం ఉంటే... అక్కడ శివుడినీ, హనుమంతుడినీ పూజించేవారట. కాలక్రమంలో ముస్లిం పాలకుల వల్ల ఆలయం కొంతవరకూ ధ్వంసం కావడంతోపాటూ ఊరివాళ్లు విగ్రహారాధనను నిర్లక్ష్యం చేశారట. కొన్నాళ్లకు మారుతి సోమానే అనే బ్రహ్మచారికి స్వామి కలలో కనిపించి తనను ఆలయంలో నిర్బంధించారని చెప్పి, గుడి గోపురాన్ని తొలగించి పునాదిపైనే పునఃప్రతిష్ఠించి మునుపటిలా పూజలు చేయాలనీ... మహిళలకు ప్రవేశం కల్పించొద్దనీ కోరాడట. ఇలా స్వామి పలు మార్లు కలలో కనిపించి చెప్పినా... ఎవరూ నమ్మరనే ఉద్దేశంతో ఆ భక్తుడు మౌనం వహించాడట. కొన్నాళ్లకు గ్రామంలో కరవుకాటకాలు మొదలవడం, కొందరు పాముకాటుతో మృత్యువాత పడటం వంటి సమస్యలు తలెత్తడంతో ఆ బ్రహ్మచారి తనకు వచ్చిన కలను ఊరిపెద్దలకు చెప్పాడట. దాంతో అంతా కలిసి పండితుల్ని సంప్రదించి... ఆలయం పైకప్పు రేకులను తొలగించి మునుపటిలా ఆరాధించడం మొదలుపెట్టారట. అప్పటినుంచీ గ్రామంలో సమస్యలు తగ్గాయనీ అలా స్వామిని రోక్డాబా (సంపదనిచ్చే దేవుడు)గా పిలవడం ప్రారంభించారనీ క్రమంగా ఆ పేరే రోక్డేశ్వర్‌గా మారిందనీ ఒక కథనం. ఇప్పటికీ మహిళలెవరూ స్వామి కొలువైన పీఠం దగ్గరకు వెళ్లకుండా... బయటి నుంచే పూజిస్తారు. ఒకవేళ ఎవరైనా మాంసం, మద్యం సేవించి ఆలయంలోకి వచ్చినా, తెలిసీ తెలియక మహిళలు ప్రవేశించినా స్వామి అలిగి, గోదావరి నది ఒడ్డుకు వెళ్లిపోతాడని నమ్ముతారు భక్తులు. ఆ సమయంలో వంటలు చేసినా సరిగ్గా కుదరవనీ ఊళ్లో ఏదో ఒక సమస్య మొదలవుతుందనీ చెబుతారు. అలిగిన స్వామిని మళ్లీ ఆలయంలోకి ఆహ్వానించేందుకు ఓ గుర్రాన్ని గోదావరికి తీసుకెళ్లి శుభ్రం చేసి అలంకరించి పూజలు నిర్వహించి వదిలేస్తారు. అలా వదిలిన గుర్రం ఎవరి ప్రమేయం లేకుండా తిరిగి ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశిస్తే స్వామి మళ్లీ మందిరంలోకి చేరాడని భావిస్తారు.


అన్నదానానికి పన్నెండేళ్లు ఆగాలి

ఈ ఊళ్లో వేపచెట్లను నరకరు. ఇక్కడ కొలువైన స్వామికి సోమవారంనాడే విశేష పూజల్ని చేస్తారు. భక్తులు ప్రాంగణంలోని మర్రిచెట్టుకు ముడుపులు కడతారు. ఈ ఆలయానికి వచ్చే భక్తుల్లో గ్రహపీడితులూ, సంతానం లేని వారూ, ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నవారూ, ఉన్నత చదువులు చదువుతున్నవారే ఎక్కువ. తమ కోరికలు తీరాక అన్నదానం చేసి మొక్కు చెల్లించేందుకు ఆసక్తి చూపిస్తారు. ఈ అన్నదాన కార్యక్రమం అరవై సంవత్సరాల క్రితం ప్రారంభమైందనీ, అప్పట్లో గ్రామస్థులే నిర్వహిస్తే రోజులు గడిచేకొద్దీ భక్తులు భాగస్వాములు అవుతున్నారనీ చెబుతుంది ఆలయ కమిటీ. నిర్వాహకులు ఆ పేర్లు నమోదు చేసుకుని వారివంతు వచ్చే రోజున భక్తులకు తెలియజేస్తారు. ఇలా పేర్లు నమోదు చేసుకున్నవారి వంతు రావడానికి ప్రస్తుతం పుష్కర కాలం పడుతుందట! స్త్రీ, పురుషులిద్దరికీ వేర్వేరు భోజనశాలలు ఉండటం ఈ ఆలయం ప్రత్యేకత.

ఎలా చేరుకోవచ్చు

హైదరాబాద్, నిజామాబాద్ నాందేడ్‌ల నుంచి ధర్మాబాద్ వరకూ రైలు సౌకర్యం ఉంటుంది. అక్కడి నుంచి నర్సి మార్గంలో రహదారిని ఆనుకుని 18కి.మీ. దూరంలోని పాటోదా(బి) రోక్డేశ్వర్ గ్రామాన్ని చేరుకునేందుకు బస్సులూ, ప్రైవేటు వాహనాలూ అందుబాటులో ఉంటాయి.

- ఈడిగ సుదర్శనగౌడు, ఈనాడు, ఆదిలాబాద్ డెస్క్
ఫొటోలు: గోడాపూర్ రాజేశ్వర్, న్యూస్‌టుడే, భైంసా



సొంతూళ్లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం

ఒకప్పుడు ఐటీ ఉద్యోగం కోసం వలస వెళ్లిన వాళ్లే ఇప్పుడు నగరాలు వదిలి పుట్టిన ఊళ్లకి తిరిగొస్తున్నారు. స్థానిక యువత వలస వెళ్లకుండా తమ ఊళ్లలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రారంభించి పట్నాలకూ ఐటీ కళ తెస్తున్నారు!

పరకాలలో ఐటీ హబ్!






కొక్కిరాల రాకేశ్‌రావుది... హనుమకొండ జిల్లా పరకాల. చదువు, ఉద్యోగం, వ్యాపారాల కోసం దశాబ్దంపాటు ఊరికి దూరంగా ఉన్నాడు. పంజాబ్‌లోని 'లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ'లో ఇంజినీరింగ్‌లో చేరినప్పుడు ఓ హోటల్‌లో రాత్రిపూట మేనేజర్‌గా పనిచేశాడు. రాకేశ్ కమ్యునికేషన్ స్కిల్స్ నచ్చి ఓ వ్యక్తి డిజిటల్ మార్కెటింగ్‌లో ఉద్యోగం ఇచ్చాడు. చదువుకు బ్రేక్ ఇచ్చి కొన్నాళ్లు అక్కడ పనిచేశాడు. ఆపైన హెల్త్ రికార్డ్స్ నమోదుచేసే అంకుర సంస్థని పెట్టాడు. అది విజయవంతం కాలేదు. దాంతో మధ్యలో విడిచిపెట్టిన బీటెక్‌ని తిరిగి పూర్తి చేశాడు. ఆపైన హైదరాబాద్‌లో ఐటీ కంపెనీ పెట్టాడు. అది పుంజుకుంటున్న దశలో కరోనా రావడంతో పరకాల వచ్చాడు. ఇక్కడ 'డిజీ యోధా' పేరుతో కంపెనీ ప్రారంభించాడు. హైదరాబాద్ నుంచి పాత ఉద్యోగులు రావడానికి ఇష్టపడలేదు. దాంతో బీటెక్ చేసిన స్థానిక యువతకు నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలిచ్చాడు. క్రమంగా నగరాలకు వెళ్లడం ఇష్టంలేని అమ్మాయిలూ ఈ కంపెనీలో చేరడం మొదలుపెట్టారు. టెక్స్ట్, ఫొటోలు, ఆడియో, వీడియో... రూపంలోని డేటాని ఉపయోగించే సాంకేతిక సేవలు, చాట్, ఈ-మెయిల్, వర్చువల్ అసిస్టెంట్... మొదలైన సేవలు అందిస్తోందీ సంస్థ. 110 మంది ఉద్యోగుల్లో మహిళలే ఎక్కువ. కుటుంబానికి దూరమయ్యామనే అసంతృప్తి లేకుండా కలల ఉద్యోగం చేసుకుంటున్నారు.

- గుండు పాండురంగశర్మ

చెన్నై వదిలి... విజయనగరం!

సంగరెడ్డి భానుమూర్తిది విజయనగరం జిల్లా ఊటపల్లి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పదేళ్లపాటు చెన్నైలో పనిచేశాడు. తిరుచ్చికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్, కంపెనీ సెక్రటరీ అయిన గాయత్రిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. అంతలోనే కొవిడ్ రావడంతో ఊటపల్లి వచ్చి ఏడాదిన్నరపాటు పని చేశారు వారిద్దరూ. ఆ సమయంలోనే తన స్నేహితుల్లో బాగా చదివేవాళ్లూ చిన్న ఉద్యోగాలతో సరిపెట్టుకోవడం చూశాడు భాను. వారికి కాస్త ప్రోత్సాహం అందిస్తే ఉన్నతంగా రాణిస్తారని, ఆ పని తానే చేయాలనుకున్నాడు. అందుకోసం స్థానికంగా ఐటీ కంపెనీ పెట్టాలనే ఆలోచనని గాయత్రితో పంచుకున్నాడు. ఆమె ప్రోత్సహించడంతో గాయత్రి సీఈఓగా 'విలేజ్ మైండ్స్' పేరుతో కంపెనీ పెట్టాడు. ముందుగా ఇంజినీరింగ్ పూర్తిచేసిన వంద మందిని ఎంపికచేసి వారికి రెండు నెలలపాటు శిక్షణ ఇచ్చాడు. వాళ్లలో 30 మందికి తన కంపెనీలోనే అవకాశమివ్వగా, మిగిలినవారు ఇతర కంపెనీల్లో చేరారు. ప్రస్తుతం విలేజ్ మైండ్స్‌లో 50 మంది పనిచేస్తున్నారు. కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, డేటా ఇంజినీరింగ్, అనలిటిక్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో సేవలు అందిస్తున్నారు. అమెరికా సహా అనేక దేశాల ప్రాజెక్టులు చేస్తున్నారు. రెండేళ్లలో సంస్థ టర్నోవర్ రూ.5 కోట్లకు చేరింది. ఉద్యోగులు రూ.20 వేల నుంచి రెండు లక్షల మధ్య వేతనాలు అందుకుంటున్నారు.



- పి.శ్రీనివాసరావు

బెల్లంపల్లికి సాఫ్ట్‌వేర్ వెలుగు!

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన చెన్నమాధవుని వెంకటరమణ, కిరణ్ మృదుల దంపతులు కరోనా సమయంలో సొంతూరు వచ్చారు. వీళ్లు అప్పటికే ముంబయిలో 'వాల్యూ పిచ్' పేరుతో ఐటీ కంపెనీని నడుపుతున్నారు.



సొంతూరుకి వచ్చాక నిరుద్యోగ యువత కోసం ఇక్కడే వాల్యూ పిచ్ శాఖని తెరిచారు. 'బెల్లంపల్లిలో ఐటీ ఉద్యోగం' అని ప్రకటించగానే 50 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలోంచి నలుగుర్ని ఎంపికచేసుకుని 2020 నవంబరులో ఆఫీసు తెరిచారు. క్రమంగా ఈ కంపెనీ గురించి తెలిసి నగరాలకు వెళ్లడం ఇష్టంలేక మరికొందరు చేరారు. టెస్టింగ్, ఇ-వెరిఫికేషన్, డిజిటల్- చెకింగ్, నోటిఫికేషన్స్... లాంటి సేవల్ని అందిస్తోందీ సంస్థ. పలు రాష్ట్రాల పోలీసు శాఖలూ, బ్యాంకులూ, ఇన్సూరెన్స్ కంపెనీలూ వీరి ఖాతాదారులే. 200 మంది ఇక్కడ పనిచేస్తూ రూ.15-.90వేల మధ్య వేతనాలు పొందుతున్నారు.



ఒకప్పుడు సింగరేణి గనులతో వెలుగులీనిన బెల్లంపల్లి... ఓపెన్ కాస్ట్ గనులు మూతబడటంతో ఆ ప్రభను కోల్పోయింది. బెల్లంపల్లికి చెందిన 'ఎర్ర' సోదరులు శ్రీరంగనాథరాజు, శ్రీనాథరాజు, సాయినాథరాజులకు కార్పొరేట్ రంగంలో ఉన్నతోద్యోగాలు చేసిన అనుభవం ఉంది. సొంతూరులో ఐటీ కంపెనీ ప్రారంభించాలని 2017లో ప్రయత్నం చేయబోతే ఊళ్లో ఏం ఉందని చేరతారని కొందరు నిరుత్సాహపరిచారు. ఆ మాటలు వారి పట్టుదలని మరింత పెంచాయి. 'సనాతన' పేరుతో ఐటీ కంపెనీని ప్రారంభించారు. ఎకనమిక్ రీసర్చ్, హెచ్‌టుహెచ్(మార్కెటింగ్) సేవలతో పాటు బెల్లంపల్లిలో స్విగ్గీ తరహా సేవలందించే 'షాప్స్ అండ్ మి' ఆప్‌ని తెచ్చి వంద మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఉద్యోగులు రూ.10 వేల నుంచి రూ.1.75లక్షల వరకూ వేతనాలు పొందుతున్నారు. యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్నీ చేపడుతున్నారు.


- ముత్తె వెంకటేశ్, బెల్లంపల్లి

ఈతరం పిల్లలు మెచ్చే ఆటల్లో వీడియోగేములే ముందుంటాయి. గంటలతరబడి ఆడే ఆ వీడియోగేములు వినోదాన్నీ, ఆనందాన్నీ పంచినా సెల్‌ఫోన్‌ను అదేపనిగా చూడటమూ మంచిది కాదు కాబట్టి... ఈసారి వాళ్లకు ఈ బోర్డుగేముల్ని ఇచ్చి చూడండి. వీడియోగేముల్ని పక్కనబెట్టి... వీటితోనే కాలక్షేపం చేస్తారంటే నమ్మండి. అదెలా అంటారేమో... ఈ బోర్డుగేములన్నీ వీడియోగేముల నుంచి తయారు చేసినవే మరి.



ఇవి.. వీడియో బోర్డు గేములు!


ఒకప్పుడు పిల్లలు చక్కగా స్కూళ్లకు వెళ్లి... సాయంత్రం స్నేహితులతో కలిసి ఆడుకోవడం, ఆ తరువాత చదువుకోవడం వంటివి చేసేవారు. కానీ కరోనా సమయంలో వాళ్లకీ సెల్‌ఫోను వాడకం పెరిగింది. ఇప్పుడు స్కూళ్లకు వెళ్తున్నా... ఇంటికి రాగానే సెల్‌ఫోను పట్టుకుని వీడియోగేములు ఆడుతూ కాలక్షేపం చేస్తున్నారు. అలాంటి పిల్లల దృష్టిని సెల్‌ఫోను నుంచి మళ్లించేవే ఈ 'వీడియో బోర్డు గేములు'. అంటే... వాళ్ల మొబైల్‌ఫోనులో ఇష్టంగా ఆడే మైన్‌క్రాఫ్ట్, టెంపుల్ రన్, క్యాండీ క్రష్, కాల్ ఆఫ్ డ్యూటీ, అమాంగ్ అజ్... వంటి వీడియోగేములన్నిటినీ బోర్డు గేముల రూపంలోనూ తీసుకొచ్చేశాయి కొన్ని సంస్థలు. వీడియో గేములు ఆడుతున్నప్పుడు కలిగే థ్రిల్‌నీ, వినోదాన్నీ అందించే విధంగా డిజైను చేసిన ఈ బోర్డు గేములు... పిల్లల్ని ఆకట్టుకోకుండా ఉంటాయా చెప్పండి.



ఏంటీ వీటి ప్రత్యేకత...

పిల్లలకు బోర్డు గేములు అనగానే పాములపటం, చెస్, బిజినెస్, లూడో లాంటివే గుర్తొస్తాయి. మరి వాటికీ ఈ బోర్డు గేములకీ తేడా ఏంటీ అంటే... అవీ ఇవీ పూర్తిగా భిన్నమని చెబుతారు తయారీదారులు. ఉత్కంఠగా సాగడం, ప్రత్యర్థుల నుంచి తప్పించుకోవడం, బుర్రకు పదును పెట్టడం, చాకచక్యంగా ఆలోచించి ఆడటం, సాహసాలు... వంటివన్నీ మేళవించినవే ఈ బోర్డుగేములు. ఉదాహరణకు ఒకప్పుడు అందరినీ ఆకట్టుకున్న టెంపుల్‌రన్ గుర్తుందా... ఓ వైపు వెంబడించే రాక్షసుడికి దొరక్కుండా పరుగెత్తుతూ, మరో వైపు నాణేల్ని సేకరిస్తూ, ఇంకోవైపు అవరోధాల్ని దాటుకుంటూ ముందుకు సాగడం భలే థ్రిల్లింగ్‌గా ఉండేది కదూ... అది కూడా ఇప్పుడు బోర్డుగేమ్ రూపంలో దొరుకుతోంది. ఇందులోనూ అచ్చమైన టెంపుల్‌రన్‌ను తలపించే బోర్డు, రాక్షసుడు, వీరుల బొమ్మలు, డైస్, టైమర్ వంటివన్నీ ఉంటాయి. టైమర్‌ను నొక్కుతూ, డైస్ వేస్తూ రాక్షసుడి బొమ్మకు దొరక్కుండా వేగంగా గమ్యస్థానానికి చేరుకోవాలన్నమాట. పిల్లల నుంచీ పెద్దలవరకూ అందరూ ఇష్టంగా ఆడే మైన్‌క్రాఫ్ట్ గేమ్ కూడా ఇంచుమించు ఇలాగే ఉంటుంది. సాధారణంగా ఈ వీడియో గేమ్‌ను ఆడేవాళ్లు ఓ వైపు అవరోధాలను అధిగమిస్తూనే... మరోవైపు పనిముట్లను సేకరించుకుంటూ... తమకంటూ ఓ 3డీ ప్రపంచాన్ని సృష్టించుకునేందుకు ప్రయత్నించాలి. ఈ బోర్డుగేము కూడా అంతే ఉత్కంఠగా సాగుతుంది. అవరోధాల్ని దాటుకుంటూ, పనిముట్లను సేకరిస్తూ కట్టడాలను నిర్మించుకునే విధంగా దీన్ని డిజైన్ చేశారు తయారీదారులు. ఆటకు అవసరమైన బ్లాకులూ, కాయిన్లూ, కార్డులూ... ఇలా అన్నీ ఉంటాయి. అదే 'కాల్ ఆఫ్ డ్యూటీ' బోర్డ్ గేములో అయితే- ఆటగాళ్లు సైనికుల పాత్రను పోషిస్తూ, శత్రుమూకల నుంచి తమని తాము కాపాడుకుంటూ చాకచక్యంగా ఆడాల్సిఉంటుంది. కరోనా కాలంలో సందడి చేసిన పబ్‌జీ, క్యాండీక్రష్ వంటివీ బోర్డుగేములుగా వచ్చేస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే... పిల్లలూ, పెద్దలూ అనే తేడా లేకుండా అంతా కలిసి కూర్చుని ఆడుకునే విధంగానే వీటిని డిజైను చేశారు కాబట్టి... నచ్చింది ఎంచుకోండి... అసలైన వీడియోగేమ్ ఆడుతున్న అనుభూతినీ పొందండి! ★







కొత్తగా...

ఇవి డిజైనర్ నాబ్‌లు



డ్రెసింగ్ టేబుల్, బీరువా, అలమర తదితరాల తలుపులకూ సొరుగులకూ ఇనుము లేదా చెక్కతో రూపొందించిన హ్యాండిల్స్ లేదా నాబ్‌లు రావడం చూస్తూనే ఉంటాం. వాటిల్లో కొత్తేముందని అనుకునేవారికోసం ఇప్పుడు సిరామిక్‌తో రూపొందించిన డిజైనర్ నాబ్‌లు వస్తున్నాయి. చూడ్డానికి బటన్ తరహాలో ఉండే ఈ నాబ్‌లకు పొడుగాటి మేకు, స్క్రూ వస్తాయి. వాటిని డ్రెసింగ్ టేబుల్, వార్డ్‌రోబ్, కప్‌బోర్డ్ అరలకు చిన్న రంధ్రం ద్వారా అమర్చి, లోపలివైపు స్క్రూను బిగిస్తే చాలు. రంగురంగుల డిజైన్లలో వస్తున్న ఈ నాబ్‌లలో ఏవి బాగున్నాయో చూడండి మరి.


ఆడుకునే సోఫాలివి...

సోఫాలపైన కూర్చోవడం లేదా కాస్త వెనక్కి వాలి విశ్రాంతి తీసుకోవడం మామూలే. ఈ రెండు ఉపయోగాలతోపాటు వాటితో హాయిగా ఆడుకునే వీలు కూడా ఉంటే పిల్లలకు భలే కాలక్షేపం అవుతుంది కదూ... ఆ కోణంలో ఆలోచించే డిజైనర్లు ఈ 'ప్లేయింగ్ కౌచ్ సోఫా'లను రూపొందించారు. చూడ్డానికి సోఫాలానే ఉన్నా ఇందులోని కుషన్లను విడిగా తీసుకుని బొమ్మల్లా పేర్చుకుంటూ ఆడుకునే విధంగా ఉంటుందిది. అంటే... సోఫా తయారీకి అవసరమైన కుషన్లను రకరకాల సైజుల్లో ఆకృతుల్లో తీసుకుని అన్నీ కలిపి జత చేయడంతో... కావాల్సిన వాటిని విడిగా తీసుకుని బొమ్మల్లా పేర్చుకుంటూ ఆడుకోవచ్చన్నమాట. యునికార్న్, డైనోసార్ వంటి ఎన్నో బొమ్మల డిజైన్లతో వస్తున్న ఈ సోఫాలను చీకట్లో మెరిసే విధంగానూ డిజైను చేయడంతో ఇవి పిల్లలకు చక్కని కాలక్షేపం అవుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.



టీబ్యాగుకీ హోల్డర్


గ్రీన్‌టీ తాగాలనుకున్నప్పుడు వేడివేడి నీటిలో ఓ టీ బ్యాగును వేసి ... కాసేపయ్యాక తీస్తే సరిపోతుంది. కానీ... తీసిన ఆ టీబ్యాగును టీపాయ్‌పైనో, బల్లపైనో పెట్టలేంగా... టీ తాగుతున్నంతసేపూ దాన్ని చేత్తోనూ పట్టుకోలేం. అలాగే కాఫీ లేదా టీతోపాటూ ఒకటిరెండు బిస్కెట్లను తినాలనుకున్నప్పుడు ఓ చేత్తో కప్పూ మరో చేత్తో బిస్కెట్లూ పట్టుకుని వాటిని టీలో ముంచుకుంటూ తాగాలంటే కష్టం అనుకునేవారికోసమే ఇప్పుడు 'టీబ్యాగు హోల్డర్' దొరుకుతోంది. చిన్న కప్పులా ఉండే ఈ హోల్డర్‌ను టీకప్పు లేదా కాఫీ మగ్గుకు జతచేసుకునేందుకు వీలుగా కొక్కెం ఉంటుంది. అవసరం అనుకున్నప్పుడు దీన్ని కప్పుకు పెట్టుకుంటే... వాడేసిన టీబ్యాగును అందులో వేసుకోవచ్చు లేదా రెండు బిస్కెట్లను పెట్టుకుని కాఫీ/టీని ఆస్వాదిస్తూ నెమ్మదిగా తినొచ్చు.



షూస్‌కి బొమ్మలు పెట్టేద్దాం



నడవడానికి సౌకర్యంగా ఉండటంతోపాటూ కాస్త స్టైలిష్‌గానూ కనిపిస్తాయనే ఉద్దేశంతో పిల్లలకోసం ఎక్కువగా క్రాక్స్ షూస్‌ను ఎంచుకుంటారు కొందరు తల్లిదండ్రులు. కేవలం సాదా రంగుల్లో... చెప్పులపై భాగంలో రంధ్రాలతో వచ్చే ఈ క్రాక్స్‌షూస్‌ను కాస్త ట్రెండీగా మార్చాలనుకున్నప్పుడు వాటికోసమే వస్తున్న ఈ 'షూ ఛార్మ్స్ లేదా యాక్సెసరీల'ను ఎంచుకుంటే సరి. పిల్లలకు నచ్చే కార్టూన్ పాత్రల నుంచీ... వాహనాలూ, పూలూ, ఆటవస్తువులూ, తినుబండారాల వరకూ రకరకాల డిజైన్లలో వచ్చేసే ఈ యాక్సెసరీలు చాలా చిన్నగా, ఆ బూట్లలోని రంధ్రాల్లో పెట్టేందుకు వీలుగా వస్తాయి. పిల్లలకు ఇష్టమైన బొమ్మల్ని ఎంచుకుంటే వాటిని మార్చిమార్చి పెట్టుకుంటూ ఉండొచ్చు.



ఎంత అధునాతన ఫోన్ అయినా దాన్ని పూర్తిస్థాయిలో ఛార్జ్ చేయడానికి... కనీసం అర్ధగంట పడుతోందిప్పుడు. కానీ, శామ్‌సంగ్ సంస్థ అతిత్వరలో కేవలం పదినిమిషాల్లోనే వందశాతం ఛార్జయ్యే ఫోన్‌ని విడుదలచేయబోతోంది.
నేటి ఇళ్ళ నిర్మాణంలో ఇనుప చువ్వలకే ఎక్కువ ఖర్చవుతోంది. ఇకపైన వాటి అవసరమేలేని సరికొత్త కంకర వస్తోంది! ఆ కంకరని వేశాక- కేవలం నిమిషాల్లోనే ఆరిపోయి గట్టిపడుతుందట.
- చదవడానికి ఈ రెండూ వేర్వేరు విషయాలుగా అనిపించినా ఈ అద్భుతాల వెనకో పదార్థం ఉంది. దాని పేరు గ్రాఫీన్!
ఓ పూతరేకు పొరలో లక్షోవంతు మందం మాత్రమే ఉండే గ్రాఫీన్... స్టీలుకన్నా రెండొందల రెట్లు గట్టిది. రాగి కంటే వందశాతం వేగంతో కరెంటుని తీసుకెళ్ళగలుగుతుంది. కనుకే, కాలికింది నేల నుంచి ఆకాశంలోని విమానాలదాకా ప్రతిదాంట్లోనూ గ్రాఫీన్ వాడకం మొదలైంది.
శాస్త్ర ప్రపంచం దీన్నో 'మ్యాజిక్ మెటీరియల్'గా కీర్తిస్తోంది! గ్రాఫిన్‌తో సరికొత్త యుగం మొదలైందనీ చెబుతోంది. ఆ యుగం పరిణామక్రమమిది...

గ్రాఫీన్... రేపటి ప్రపంచం దీనిదే!

ఆ ఇద్దరూ శాస్త్రవేత్తలు. ఒకాయన ప్రొఫెసరైతే... ఇంకొకరు ఆయన విద్యార్థి. ఆరోజు ఆ ఇద్దరూ దేనికోసమో తీవ్రంగా శోధిస్తున్నారు. తమ రోజువారీ పరిశోధనని కాసేపు పక్కనపెట్టి మరీ... వెతుకులాటలో నిమగ్నమయ్యారు. వాళ్ళు ఆ రోజు గాలిస్తున్నది చెత్తబుట్టల్ని! వాటిల్లో చిందర వందరగా పడి ఉన్న సెల్లో టేపుల్ని!

ఇంగ్లండులోని మాన్‌చెస్టర్ వర్సిటీలోని సెంటర్ ఫర్ మెసో సైన్స్ అండ్ నానో టెక్నాలజీ భవనంలో సాగుతోంది ఈ తతంగమంతా. అది 2002 సంవత్సరం సెప్టెంబర్ నెల 23. ఆ రోజు ఉదయం నుంచి రాత్రిదాకా ఇద్దరూ ఇలా వెతకడం చూసిన వాళ్ళందరూ వెక్కిరింపుగానో జాలిగానో నవ్వుకున్నారు. కానీ ఆ ఇద్దరూ మాత్రం ఆ సెల్లోటేపులన్నింటినీ సేకరించుకుని వచ్చి మైక్రోస్కోప్ కింద పెట్టారు. కళ్ళలో వత్తులేసుకుని మరీ- ఓ పదార్థం కోసం వెతికారు. అది దొరికాక... 'హుర్రే' అని వాళ్ళు సంబరపడిపోలేదుకానీ... ప్రపంచం మాత్రం నివ్వెరపోయింది. ఎందుకంటే- ఆ చెత్తబుట్టల్లో, వాటిల్లోని సెల్లోటేపుల్లో వాళ్ళకి ఆ రోజు కనిపించింది 'గ్రాఫీన్' అన్న అతిపలచటి పదార్థం కాబట్టి! దాన్ని వెతికిపట్టుకున్నందుగ్గాను ఆ ఇద్దరికీ 2010లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చింది. దాన్ని అందుకున్న ఆ ప్రొఫెసర్ పేరు- ఆండ్రె గయమ్. [illegible] విద్యార్థి- కాన్‌స్టాంటిన్ నవసేలవ్.

[illegible]బెల్ పురస్కారం సందర్భంగా ప్రొఫెసర్ ఆండ్రె గయమ్ చెప్పిన మాటలు చరిత్రలో నిలిచిపోయాయి... 'గ్రాఫీన్ అన్నది మేం కొత్తగా కనిపెట్టింది కాదు. ప్రపంచం పుట్టినప్పటి నుంచీ అది ఉంది... మా యూనివర్సిటీ ప్రొఫెసర్లందరూ విసిరిపారేసిన సెల్లోటేపుల్లో దాక్కుని ఉంది. వాటిని విసిరేసేటప్పుడు కాస్త ఆగి- తమ మైక్రోస్కోప్‌కి పనిచెప్పి ఉంటే ఈ నోబెల్ బహుమతి వాళ్ళకే దక్కి ఉండేది. ఆ రకంగా వాళ్ళు విసిరేసింది ఉత్త టేపుల్ని కాదు... కొత్త అవకాశాలనీ... సరికొత్త యుగాన్నీ' అని చెప్పారాయన. ఈ ప్రొఫెసర్ మాటల్నే కొంత పరిశీలించి చూద్దాం. గ్రాఫీన్ అన్నది ప్రపంచం పుట్టినప్పటి నుంచీ ఉంది అంటున్నాడాయన. ఉంటే అది ఎలా ఉంది? అప్పటిదాకా ఎందుకు ఎవరూ కనిపెట్టలేకపోయారు? వాటికి జవాబు వెతుకుదాం రండి...

'ఇందుగలడందులేడన్న సందేహంబు వలదు...' అంటాడు పోతన ఆ పరమాత్ముని గురించి. ఆ పద్యం 'కార్బన్'కి కూడా బాగా వర్తిస్తుంది. మీరు చదువుతున్న ఈ కాగితమో కంప్యూటరో మొబైలో మీ చుట్టూ ఉన్న పదార్థాలో... ఏవైనా సరే, వాటిల్లో ఎంతోకొంత కార్బన్ ఉండితీరుతుంది. అందుకే ఆక్సిజన్, హైడ్రోజన్, హీలియం తర్వాత విశ్వంలో అత్యధికంగా వ్యాపించి ఉన్న మూలకం ఇదేనంటారు. అన్నింటా ఉన్నా... భూమిపైన దీని ప్రధాన రూపాలు నాలుగు! ఒకటి- బొగ్గు. ఆదిమానవుడు నిప్పుని కనిపెట్టిన కాలం నుంచే ఇది మనకి తోడుంది. ఇనుముని ఉక్కుగా మార్చి మనకి ఆయుధాలుగా ఉపయోగపడటంలో కీలకపాత్ర పోషించింది. రెండో రూపం - వజ్రం. క్రీస్తు పూర్వం 2500 నుంచీ వీటిని వెలికి తీసి నగలుగా అలంకరించుకుంటున్నాం. మూడోది- ఫులెరీన్ అనే అతిసూక్ష్మ పదార్థం. దీన్ని ఎక్కువగా ల్యాబుల్లోనే తయారుచేస్తారు. నాలుగోది- గ్రాఫైట్. గ్రాఫీన్ తయారీలో కీలక పాత్రధారి ఇదే...

'పెన్సిల్ ములికిని దేనితో తయారు చేస్తారు?' - స్కూల్ సైన్స్ పాఠాల్లో ఈ ప్రశ్న వస్తుంది. 'గ్రాఫైట్' అన్నది దానికి జవాబు. 16వ శతాబ్దంలో ఉత్తర ఇంగ్లండులోని పశువుల కాపర్లకి పొరలుపొరలుగా ఉన్న పెద్ద రాళ్ళలా ఇవి దొరికాయి. ఆ రాళ్ళ ముక్కల్ని మొదట బొగ్గనుకుని మండించారు కానీ అది మండలేదు. కానీ- ఆ రాళ్ళు ఏదైనా గీయడానికీ రాయడానికీ అనువుగా ఉండటంతో- గొర్రె చర్మాలపైన వాటితో గుర్తులు వేయసాగారు. దాదాపు



రెండు శతాబ్దాల దాకా అందుకోసమే ఉపయోగిస్తూ వచ్చారు దాన్ని. 18వ శతాబ్దంలో ఆ రాళ్ళపైన శాస్త్రవేత్తల దృష్టి పడింది. రాయడానికి అనువుగా ఉంది కాబట్టి దీనికి గ్రాఫైట్(గ్రాఫ్ అంటే లాటిన్‌లో రాత అని అర్థం) అని నామకరణం చేశారు. పనిలోపనిగా - ఇది రాతకే కాదు ఫిరంగి గుండ్ల తయారీకి బాగా ఉపయోగపడుతుందనీ కనిపెట్టారు. ఇంకేం... ఇంగ్లండు ప్రభుత్వం ఆ గనుల్ని సొంతం చేసుకుంది. భారత్, శ్రీలంకల్లోనూ పుష్కలంగా దొరికిన గ్రాఫైట్ నిల్వలపైన ఆ సర్కారు ఆధిపత్యం చెలాయించింది. ఫ్రాన్స్‌పైన శత్రుత్వంతో అక్కడికి సరఫరా చేయడం నిలిపేసింది! దాంతో ఫ్రెంచివాళ్ళు కొత్త ఆవిష్కరణలకి నడుంకట్టారు. తమ దగ్గర మిగిలిన అతితక్కువ గ్రాఫైట్ నిల్వలకి బంకమట్టిని కలిపి సరికొత్త పెన్సిళ్ళను తయారుచేసుకోసాగారు. అంతేకాదు, గ్రాఫైట్‌ని పొడిగా చేసి వాడటం, వాటితో అతికించే పదార్థాలూ తయారుచేయడం మొదలుపెట్టారు. ప్రస్తుతం బ్యాటరీల నుంచి రాకెట్‌ల తయారీవరకూ ఎన్నో ఉత్పత్తులకి గ్రాఫైట్‌ని వాడుతున్నారు. మరి అలాంటి గ్రాఫైట్ నుంచి గ్రాఫీన్‌ని తయారు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది...? దానికి సమాధానం తెలియాలంటే- కొద్దిగా సైన్సులోకి వెళ్ళాలి...

పూతరేకులాంటిదే...

బొగ్గూ, వజ్రమూ, గ్రాఫైటూ... ఇవి కార్బన్‌కి చెందిన వేర్వేరు రూపాలనుకున్నాం కదా! ఇవన్నీ ఎప్పటి నుంచో ఉపయోగంలో ఉన్నా కూడా- 1772లోనే తొలిసారి బొగ్గూ వజ్రం ఒకేకోవకి చెందిన వస్తువులని కనిపెట్టగలిగారు. మరో ఏడేళ్ళకి- గ్రాఫైట్ కూడా ఇదే రకానికి చెందిందని నిర్ధరించారు. 19వ శతాబ్దం నాటికి ఈ మూడింటికీ రసాయన నిర్మాణాన్ని(కెమికల్ స్ట్రక్చర్) రూపొందించారు. ఈ మూడింటికీ అణువుల సంఖ్య ఇంచుమించు ఒకటేకానీ అవి ఒకదానికొకటి అనుసంధానమైన విధానం వేరని పసిగట్టారు. వజ్రంలోని అణువుల నిర్మాణం దగ్గరదగ్గరగా ఓ పెట్టె(క్యూబ్) ఆకారంలో ఉంటుంది కాబట్టి దానికి గట్టితనం ఎక్కువ. బొగ్గు నిర్మాణం కాస్త చిందరవందరగా ఉండటం వల్ల పెళుసుగా ఉంటుంది. కానీ- గ్రాఫైట్‌లోని అణువుల నిర్మాణం ఆరుకోణాల్లో(హెక్సాగన్) అందంగా అమరి ఉంటుంది. అంతేకాదు- ఈ అణువులన్నీ ఒకదానిపైన ఒకటి పొరలుపొరలుగా పేర్చినట్టు ఉంటాయి. అంటే- ఓ పూతరేకులా ఉంటుందని అనుకోవచ్చు. 'మరి ఆ పూతరేకు నుంచి ఒక్క రేకుని మాత్రమే వేరుచేయగలిగితే?' అన్న ఆలోచన వచ్చింది శాస్త్రవేత్తలకి. ఆ ఆలోచన ఫలితమే గ్రాఫీన్!

ఇంతకీ ఎందుకు తీయాలి?

సూక్ష్మంలో మోక్షం అన్నది నేటి పారిశ్రామికరంగం నినాదం. తక్కువ స్థలాన్నీ, ఇంధనాన్నీ తీసుకుని ఎక్కువ ఫలితాన్నిచ్చే వస్తువుల ఆవిష్కరణల కోసం శాస్త్రవేత్తలవైపు చూస్తుంటారు వాళ్ళు. ఒకప్పుడు ఒక గది పరిమాణంలో ఉండే కంప్యూటర్- ఇప్పుడు మన చేతిలో ఒదిగిపోతోందంటే అలాంటి పరిశోధనల చలవే. పొరలు పొరలుగా ఉన్న గ్రాఫైట్ నుంచి కేవలం అణువంత పలుచటి పొరని వేరుచేసి... దాన్ని ఉపయోగించాలన్న ఆలోచన 1940 నుంచే ఉంది. అలా వేరుచేయగలిగితే - ఆ పొర దాని మాతృక గ్రాఫైట్‌కన్నా వెయ్యిరెట్లు గట్టిగా ఉంటుందనీ స్టీలుకన్నా రెండొందల రెట్లు స్థిరంగా ఉంటుందనీ గ్రహించారు. ఒట్టిగట్టిదనమే కాదు... ఇందులో 'ఛార్జింగ్ పార్టికల్స్' అన్న ప్రత్యేక అణువులూ ఉన్నాయని తెలుసుకున్నారు. వాటివల్ల- ఇవి రాగికన్నా వందశాతం వేగంగా కరెంటుని తీసుకెళ్ళగలవని నిర్ధరించారు. స్టీలుకన్నా గట్టిది, అత్యంత వేగంగా కరెంటుని సరఫరా చేయడమేకాక ఓ రబ్బర్‌లా ఎటువంచితే అటు వంగేది... ఒకే పదార్థంలో ఈ రెండు లక్షణాలూ ఉంటే ఇంకేం కావాలి? దీనితో ఓ సెల్‌ఫోన్‌ని తయారుచేయాలనుకుందాం. అందులో వాడాల్సిన రాగి అక్కర్లేదు కాబట్టి... పెద్దగా కనెక్షన్‌లూ వాటికి అవసరమైన పరికరాలూ అవసరంలేదు. అందువల్ల చాలా సన్నగా దీన్ని తయారుచేయొచ్చు. పైగా- పూర్తి ఫ్లెక్సిబుల్‌గా ఉంటుంది కాబట్టి ఇట్టే మడతపెట్టేయొచ్చు! మడవగలిగినా- అంతేస్థాయిలో గట్టిగానూ ఉంటుందన్నమాట. ఇలాంటి ఉపయోగాలెన్నో ఉంటాయికాబట్టే... పరిశోధకులు దీనిపైన దృష్టిపెట్టారు. కానీ- గ్రాఫైట్ నుంచి కేవలం అణువంత పొరని తీయడం అరవైయేళ్ళపాటు ఎవరికీ సాధ్యంకాలేదు. ఓ వినూత్న ఆలోచనే దాన్ని సాధ్యం చేసింది...

అసలు పరిశోధన ఇది కాదు...


నిజానికి, ప్రొఫెసర్ గయమ్ తన బృందంతో కలిసి ఫిజిక్స్‌పైన రకరకాల ప్రయోగాలు చేస్తూ... ఓ ఆటవిడుపుగానే గ్రాఫీన్‌పైన దృష్టిపెట్టాడు. దీని పరిశోధనలకి తన సొంత జీతాన్నే వాడుతూ వచ్చాడు. అలా అతని దగ్గర జా డాంగ్ అనే పరిశోధక విద్యార్థి చేరాడు. అతనికి



ల్యాబుల్లో వాడే ఓ గ్రాఫైట్ ముద్దని ఇచ్చి- అందులో నుంచి అణువంత పలుచని పొరని వేరు చేసి ఇవ్వమన్నాడు. ఓ సుద్ద ముక్కని అరగతీస్తూ పోతే చివరగా సన్నటి పొర మిగులుతుంది కదా! అలాగే, అతను దాన్ని అరగతీసీ... తీసీ... చివరికి ఓ ముక్కని ప్రొఫెసర్‌గారి చేతిలో పెట్టాడు. దాన్ని ఆయన మైక్రోస్కోపులో చూస్తే- అది గ్రాఫీన్ కాలేదని తేలింది! పైగా, కాసేపటికే ఫట్‌మని విరిగిపోయింది. 'అయ్యో! నా యాభైవేలు పోయాయే' అని ప్రొఫెసర్ గయమ్ బాధపడుతూ ఉంటే ఓ ఉపాయం చెప్పాడు కాన్‌స్టాంటిన్ నవసేలవ్ అనే మరో విద్యార్థి! అదేమిటంటే...

అలా బయటపడింది...

ఫిజిక్స్ ల్యాబుల్లో గ్రాఫైట్‌ని మైక్రోస్కోపు స్పష్టతని పరీక్షించడానికి వాడుతుంటారు. గ్రాఫైట్‌లోని సూక్ష్మ అణువులు ఎంతబాగా కనిపిస్తే- ఆ మైక్రోస్కోపు అంతచక్కగా పనిచేస్తుందని లెక్కన్నమాట. అందుకోసం టెస్టు చేయాలంటే- ముందు గ్రాఫైట్ శుభ్రంగా ఉండాలికదా! అలా శుభ్రంచేయడానికి దాన్ని కడగరూ, తుడవరూ. ఓ సెల్లోటేపు తీసుకుని దానిపైన అతికించి... తీస్తూ ఉంటారు. అలా తీసినప్పుడు గ్రాఫైట్ పైనున్న దుమ్మూధూళీ టేపుకి అంటుకుని వచ్చేస్తుందన్నమాట! 'ఆ రకంగా వాడిన టేపులో- అతిసన్నటి గ్రాఫైట్ పొర ఉండొచ్చేమో!' అన్న ఆలోచన వచ్చింది నవసేలవ్‌కి. ఆ విషయం- తన ప్రొఫెసర్‌కి చెప్పాడు. ఆయనకి ఈ ఆలోచన బాగుందనిపించడంతో ఇద్దరూ కలిసి- ఆ టేపుల్ని పడేసిన చెత్తబుట్టల్ని గాలించారు! దొరికిన వాటిని మైక్రోస్కోపులో పెట్టి చూస్తే... యురేకా! వీళ్ళు కోరుకున్న అణువంత పొర



భారత్ ఎక్కడుంది?

రెండు దశాబ్దాల కిందట సెమీ కండక్టర్ల తయారీ అవకాశం వస్తే - దాన్ని మనదేశం అందుకోలేక పోయింది. చైనా దాన్ని తన్నుకు పోయింది. కానీ గ్రాఫీన్ విషయంలో భారత్ ఎంతో మెలకువతో వ్యవహరించింది. గ్రాఫీన్‌ని ఆవిష్కరించిన మూడేళ్ళకే బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఐఐఎస్‌సీ) తనదైన పరిశోధనతో దాన్ని సులువుగా తయారుచేసే రియాక్టర్‌ని రూపొందించింది. ఆ టెక్నాలజీని టాటా స్టీల్ సంస్థ కూడా అందిపుచ్చుకుని భారీ ఎత్తున తయారీ మొదలుపెట్టింది. పాత ప్లాస్టిక్‌ని అతితక్కువ సమయంలో కొత్తగా




మార్చే సాంకేతికతని కూడా కనిపెట్టింది. మహారాష్ట్రలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నానో సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ రైతుల కోసం పండ్లూ కాయగూరల్ని నిల్వచేసే బ్యాగుల్ని తయారుచేసింది. ఏ మాత్రం నిల్వ రసాయనాలు (ప్రిజర్వేటివ్స్) వాడని ఈ బ్యాగులు పండ్లు తాజాగా ఉండే సమయాన్ని రెట్టింపు చేస్తాయట! ఇక- మన దేశంలోని లాగ్9 అనే స్టార్టప్... గ్రాఫీన్ సాయంతో విద్యుత్తు ఉత్పత్తిలో వాడే అతిశక్తిమంతమైన కెపాసిటర్లని తయారుచేస్తోంది. ఆర్ఎఫ్ నానో కంపోసిట్స్ అనే మరో స్టార్టప్... ఏకంగా రాడార్‌లని ఏమార్చే(స్టెల్త్ టెక్నాలజీ) యుద్ధపరికరాలని మన సైన్యానికి అందిస్తోంది. గేగాడైన్ అనే మరో స్టార్టప్ ఈవీ వాహనాలని కేవలం ఎనిమిది నిమిషాల్లో రీచార్జ్ చేసే బ్యాటరీలని ఆవిష్కరిస్తోంది. ఇలాంటి స్టార్టప్‌లు మనదేశంలో డజనుకుపైగా ఉన్నాయి. ఈ వాతావరణాన్ని ప్రోత్సహించడానికీ, మరెన్నో పరిశోధనలు చేయడానికీ కేరళలో 'ఇండియా ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ గ్రాఫీన్'ని ఏర్పాటుచేసింది కేంద్ర ప్రభుత్వం.

దానికి అంటుకుని ఉంది. దానిపైన ఓ సిల్వర్ కోటింగ్‌ని వేసి... కరెంటుని సరఫరా చేస్తే... అందులోని అణువులు గ్రాఫైట్‌కన్నా భిన్నంగా కదలడం, అత్యంత వేగంగా కరెంటుని మోసుకెళ్ళడం చూశారు. ఇక- అతినాజూకైన ఆ పొరని వేరుచేసి అలాంటి వేలాది పొరల్ని సృష్టించగలిగారు. వాటిని కంటికి కనిపించే వస్తువులా మార్చడానికని ఒకదానిపైన ఒకటి పేర్చారు! 'అలా పెడితే మళ్ళీ అది గ్రాఫైట్‌లా మారిపోతుంది కదా?' అన్న సందేహం రావొచ్చు. అలా అవి అతుక్కుపోకుండా- ఆ పొరలని ఆక్సిడైజేషన్ పద్ధతితో వేరు చేశారు. ఈ కృషికే నోబెల్ బహుమతి వచ్చింది! శాస్త్రవేత్తల అరవై ఏళ్ళ కల సాకారమైంది! పదేళ్ళు తిరగకుండానే 'అది ఇది ఏమని అన్నిరంగముల' అన్నట్లు... రకరకాల రూపాల్లో గ్రాఫీన్ వాడకం మొదలైంది. మచ్చుకి కొన్ని చూద్దాం...

మొబైల్ టెక్నాలజీలో : 'గ్రాఫీన్‌తో ఫ్లెక్సిబుల్ మొబైల్ ఫోన్‌లు వచ్చేస్తాయి' అన్నాడు దాన్ని ఆవిష్కరించిన ప్రొఫెసర్ గయమ్- నోబెల్‌ని అందుకుంటూ. కాస్త ఆలస్యమైనా- త్వరలోనే అలాంటి ఫోన్‌లు రాబోతున్నాయి. ఈ ఫోన్‌లు పూర్తి పారదర్శకంగానూ ఉంటాయి. అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) ఇప్పటికే వీటి ప్రొటోటైపుల్ని తీసుకొచ్చింది. షామీ సంస్థ గ్రాఫీన్ బ్యాటరీ ఫోన్ అంటూ ఐదువేల ఎంఏహెచ్‌తో ఓ ఫోన్‌ని గతేడాది మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. దాన్ని తలదన్నేలా ఈ ఏడాది శామ్‌సంగ్- కేవలం 12 నిమిషాల్లో పూర్తిస్థాయిలో ఛార్జ్ అయ్యే ఫోన్‌ని తీసుకొస్తోంది. వేగంగా ఛార్జ్ అవ్వడమే కాదు... ఆ ఛార్జ్ వారంపాటు ఉంటుందట! ఆపిల్ సంస్థ కూడా గ్రాఫీన్ సాయంతో తమ ఐఫోన్‌లలో అతి సూక్ష్మ మైక్రోఫోన్‌ని ఫోన్‌లో పెట్టబోతోంది. దాని ద్వారా- ఫోన్ బరువును బాగా తగ్గించి అతి సన్నటి మోడల్‌ని తీసుకురాబోతోంది.

వైద్యరంగాన : గ్రాఫీన్ కణాలు చుట్టుపక్కల వాతావరణంలోని ప్రతిచిన్నమార్పునీ క్షణంలో పసిగట్టగలుగుతాయి. ఈ లక్షణం- దాన్ని వైద్యరంగానికి దగ్గరచేస్తోంది. కొందరు రోగులకి అనునిత్యం గుండెరేటునీ, నాడీ వ్యవస్థని పరిశీలించాల్సి ఉంటుంది. ఇందుకోసం- వాళ్ళ శరీరంపైన ఎప్పుడూ ఓ పరికరం ఉండాలి! దానికి బదులు- కేవలం ఓ టాటూ పూతతో(అందులో గ్రాఫీన్ పొడి ఉంటుంది) నిత్యం రోగి తీరుతెన్నుల్ని పరిశీలించే విధానం



వచ్చేసింది. దీంతోపాటూ- క్యాన్సర్ కణాలని కచ్చితంగా గుర్తించి దాన్ని అంతమొందించే మెడిసిన్ క్యారియర్ క్యాప్సుల్స్‌గానూ తెస్తున్నారు. జన్యు సంబంధిత క్యాన్సర్ ప్రమాదాన్ని ముందుగా పసిగట్టే బయో సెన్సర్‌లనీ యూరప్‌లో ఉపయోగిస్తున్నారు.

'రక్షణ' కోసం : గ్రాఫీన్ పలచగా ఉన్నా స్టీలుకన్నా గట్టిగా ఉంటుంది కదా! ఈ లక్షణం హెలికాప్టర్‌లూ, యుద్ధవిమానాల తయారీకి ఉపయోగపడుతోంది. తక్కువ ఖర్చు, కొద్దిపాటి స్థలంలోనే శక్తిమంతమైన 'క్రూ క్యాబిన్'లని ఇప్పటికే తయారుచేస్తున్నారు. గ్రాఫీన్‌కున్న మరో లక్షణం- అయస్కాంత తరంగాలని తప్పించుకోవడం. అంటే- దానితో చేసే పరికరాలు శత్రుదేశాల రాడార్ పరికరాలని మోసం చేస్తాయన్నమాట! ఈ లక్షణాన్ని చక్కగా ఉపయోగించుకుంటూ చైనా ఈ మధ్యే- రాడార్‌లకి అందని హెలికాప్టర్‌లని తన అమ్ములపొదిలోకి చేర్చింది.

భవన నిర్మాణంలో : ఈ రంగంలో స్టీల్ వాడకాన్ని సగానికి సగం తగ్గించేలా- గ్రాఫిన్‌తో సరికొత్త కంకరని తయారుచేస్తోంది లండన్‌కి చెందిన లెవిడియన్ అన్న సంస్థ. ఈ కంకరలో కేవలం ఒక్కశాతం గ్రాఫీన్ ఉన్నా... 60 శాతం మన్నికనిస్తుంది. అలా సిమెంటు వాడకాన్ని భారీగా తగ్గిస్తుంది. ఇనుపచువ్వల అవసరం లేకుండా కేవలం కంకరతోనే గట్టిదనాన్ని తెస్తున్నారు. చువ్వల్ని వాడినా వాటి మన్నికని గ్రాఫీన్ రెట్టింపు చేస్తుందని చెబుతున్నారు. వైరింగ్‌లోనూ గ్రాఫీన్ విప్లవాన్ని సృష్టిస్తోంది. రాగికన్నా వందరెట్లు వేగంగా ఇది- కరెంటుని మోసుకెళ్తుంది కాబట్టి రాగిశాతాన్ని తగ్గించి... గ్రాఫీన్ చేర్చిన వైర్లు పెద్ద సంఖ్యలో తయారవుతున్నాయి.

వస్త్రాల్లోనూ : గ్రాఫీన్‌తో దోమలు మన దగ్గరకే రాకుండా ఉండే ప్రత్యేక దుస్తుల్ని తయారుచేస్తున్నారు. దోమల్ని భయపెట్టే రసాయనాలు ఇప్పటికే ఉన్నాయికానీ... వాటిని వస్త్రంపైన వేసి దుస్తులు తయారుచేయడం కష్టంగా ఉండేది. గ్రాఫీన్ ఆ ఇబ్బందిని పారదోలి- ఆ రసాయనం సహజంగా వస్త్రంపైన కలిసేలా చూస్తుంది. అంతేకాదు, క్రీడాకారుల కోసం- శరీరం వేడెక్కి ఎక్కువ చెమటపట్టకుండా చూసుకునే వస్త్రాలూ వచ్చాయి.

సైన్సు... సామాన్యులకి ఓ పట్టాన అర్థంకాని లెక్కలతో నిండి ఉండొచ్చు. కానీ అది వేసే ప్రతి అడుగూ- మానవజాతికి ఓ ముందడుగు అని చెప్పొచ్చు. ఒకప్పటి రాతియుగమైనా, పారిశ్రామిక విప్లవంతో వచ్చిన ప్లాస్టిక్ యుగమైనా, నేటి సిలికాన్ శకమైనా... మానవ మనుగడని అలా ముందుకు నడిపించినవే! గ్రాఫీన్‌తో అలాంటి నూతన యుగం ఒకటి ప్రారంభమవుతుందన్న అంచనా... శాస్త్రవేత్తలది. ఆ మాట నిజం కావాలి అన్న శుభకామన... మనందరిది! ★

అవీ ఇవీ

గర్భిణీలు బరువు పెరిగితే...



గర్భంతో ఉన్న వాళ్లు తమకీ పుట్టబోయే బిడ్డకీ సరిపడేలా ఎక్కువ ఆహారం తీసుకోవడం మామూలే కాబట్టి ఆ సమయంలో బరువు పెరగడాన్ని పెద్ద సమస్యగా పట్టించుకోరు. కానీ ఆ సమయంలోనూ అతిగా బరువు పెరగకూడదనీ అందుకోసం ఆహార నిపుణుల్ని సంప్రదించడం మంచిదనీ చెబుతున్నారు బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ నిపుణులు. ముప్పై సంవత్సరాల వ్యవధిలో వంద అధ్యయనాలను పరిశీలించినప్పుడు- డైటీషియన్ల సలహాసూచనల మేరకు సరైన ఆహారాన్ని తీసుకున్నవాళ్లు మరీ ఎక్కువగా బరువు పెరగలేదనీ పైగా ఆరోగ్యంగానూ ఉన్నట్లు గుర్తించారు. ఆ సమయంలో కొన్ని పదార్థాల వాసనలు పడకపోవడం, వికారంగా అనిపించడంతో ఆరోగ్యకరమైన పండ్లూ కూరగాయల్లాంటివి కొందరు సరిగ్గా తీసుకోరు. అదే సమయంలో క్రేవింగ్ కారణంగా తీపి పదార్థాల్లాంటివి అతిగా తింటుంటారు. దీనివల్ల మధుమేహం... ఇతరత్రా సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఆ సమయంలో సరైన ఆహారం తీసుకోవడంతో పాటు కొంత వ్యాయామం కూడా అవసరమే అంటున్నారు సదరు పరిశీలకులు.

ఆ టీతో మధుమేహం దూరం!

బ్లాక్ టీలో కొన్ని రకాల సుగంధద్రవ్యాలనూ పండ్లరసాలనూ కలిపి పులియబెట్టడంతో అందులో మంచి బ్యాక్టీరియా తయారవుతుంది. దీన్నే కొంబుచా టీ లేదా ఫంగస్ టీ అని పిలుస్తారు. ఆగ్నేయాసియా దేశాల్లో వందల ఏళ్ల నుంచీ ఈ టీని తాగుతున్నారు. అలా తాగుతున్నవాళ్లలో మధుమేహ వ్యాధి బాగా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు జార్జ్ టౌన్ మెడికల్ సెంటర్‌కు చెందిన పరిశోధకులు. మధుమేహంతో బాధపడుతున్న కొందరిని తీసుకుని రెండు విభాగాలుగా చేసి సగం మందికి నాలుగు వారాలపాటు ఈ టీని ఇచ్చారట. ఆ తరవాత మామూలుగానే రోజువారీ ఆహారాన్ని తినమన్నారట. మరో వర్గానికి ఏమీ ఇవ్వకుండా రోజువారీ తినే ఆహారాన్నే తీసుకోమన్నారు. ఆ తరవాత ఇరు వర్గాల్నీ పరిశీలించగా- కొంబుచా తీసుకున్నవాళ్లలో రక్తంలో గ్లూకోజ్ శాతం బాగా తగ్గినట్లు గుర్తించారు. దాంతో దీన్ని రోజూ తాగడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులను- ముఖ్యంగా, మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చు అంటున్నారు. ఎందుకంటే చిన్నవయసులోనే మధుమేహం బారినపడ్డవాళ్లలో ఒత్తిడి, ఆందోళన ఎక్కువై అనేక వ్యాధులకు గురవుతున్నారు. కాబట్టి ప్రి-డయాబెటిస్, డయాబెటిస్‌తో బాధపడుతున్నవాళ్లు ఈ టీని తాగడం వల్ల ఫలితం ఉంటుందని చెప్పుకొస్తున్నారు సదరు పరిశోధకులు.



మతిమరపునకు సువాసనల మందు!



మంచి నిద్రపడుతుందని చాలామంది మల్లె, జాజి... వంటి పువ్వుల్ని తలలో అలంకరించుకుంటారు. లేదా మంచి వాసనల్ని వెలువరించే వేపరైజర్లనో అగరుబత్తీల్నో గదిలో పెట్టుకుని పడుకుంటారు. అంటే- పరిమళం మంచి నిద్ర పట్టేలా చేస్తే, ఆ నిద్ర మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే కాలిఫోర్నియా యూనివర్సిటీ పరిశోధకులు కొందరు వృద్ధులకు ఆరునెలలపాటు రోజూ రాత్రివేళలో రెండు గంటలపాటు మంచి పరిమళాన్ని పీల్చుకునే ఏర్పాటుచేశారట. రోజ్, ఆరెంజ్, యూకలిప్టస్, నిమ్మ, పెప్పర్‌మింట్, రోజ్‌మేరీ, లావెండర్... వంటి వాసనల్ని పీల్చేలా చేయడంతో వాళ్లలో జ్ఞాపకశక్తి సమస్యలు తగ్గి, చురుగ్గా ఆలోచించగలుగుతున్నట్లు గుర్తించారు. ఆఘ్రాణశక్తి తగ్గినవాళ్లలో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయనీ; ఆల్జీమర్స్, స్కిజోఫ్రీనియా, మతిమరుపు బారినపడ్డవాళ్లు వాసనల్ని గుర్తించలేకపోవడానికీ అదే కారణమనీ అంటున్నారు. దాంతో డిమెన్షియాకి గురయినవాళ్లకు కొన్ని రకాల వాసనల్ని రోజుకి రెండుసార్లు చూసేలా చేయగా- వాళ్లలో జ్ఞాపకశక్తి, భాషా పరిజ్ఞానం పెరిగిందట. దీని ఆధారంగా వాసనకీ జ్ఞాపకశక్తికీ గాఢమైన బంధం ఉందని చెబుతున్నారు.

కె-విటమిన్ లోపిస్తే...

రక్తం గడ్డకట్టేందుకూ ఎముకల నిర్మాణానికీ గుండె పనితీరుకీ విటమిన్-కె కీలకమని తెలిసిందే. అయితే కె-విటమిన్ ఊపిరితిత్తుల ఆరోగ్యానికీ అవసరమే అని కోపెన్‌హాగన్ యూనివర్సిటీ హాస్పిటల్‌కు చెందిన పరిశోధకులు పేర్కొంటున్నారు. దీనికీ శ్వాసకోశ సమస్యలకీ సంబంధం ఉన్నట్లు గుర్తించారు. ఇది తక్కువైతే ఆస్తమా, కఫంతో కూడిన శ్వాస సమస్యలు వస్తున్నాయని వాళ్ల పరిశీలనలో స్పష్టమైంది. ఇందుకోసం వీళ్లు 22 నుంచి 77 సంవత్సరాల వయసువాళ్లను ఎంపికచేసి వాళ్ల ఊపిరితిత్తుల పనితీరుని స్పైరోమెట్రీ పరీక్ష ద్వారా గుర్తించారట. ఆ తరవాత వాళ్ల రక్త నమూనాల్ని సేకరించి క్షుణ్ణంగా పరిశీలించారట. అందులో ప్రత్యేకించి కె-విటమిన్ లోపించిన వాళ్లలో ఆస్తమా, కఫం, దగ్గు... వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. దీని ఆధారంగా ఇది తక్కువగా ఉన్నవాళ్లకు ఆయా సప్లిమెంట్లను అందించడంవల్ల ఫలితం ఉండొచ్చని భావిస్తున్నారు. ఆరోగ్యంగా ఉండేవాళ్లు సైతం కె-విటమిన్ సమృద్ధిగా ఉండే ఆకుకూరల్నీ తృణధాన్యాల్నీ ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.









మొగలిపువ్వు...
మధురమైన వాసనకు మరోపేరు.
కానీ పాములు వస్తాయన్న భయంతో ఇళ్లలో ఆ చెట్లను పెంచరు. తుప్పల్లోనే కనిపిస్తుంటాయి. అయితే ఒడిశాలోని గంజాం పరిసరాలతోబాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఇచ్ఛాపురం ప్రాంతంలో మాత్రం మొగలితోటల్ని ఇష్టంగా పెంచుతుంటారు. అంతేఇష్టంగా వాటినుంచి పరిమళ తైలాన్నీ తయారుచేస్తుంటారు!



మొగలి... గంజాంలో గుబాళిస్తోంది!

'ముద్దబంతి పూలు పెట్టి మొగలి రేకులు జడను చుట్టి...' అంటూ పాటల్లోనే కాదు, మొగలి పువ్వు ప్రస్తావన పురాణాల్లోనూ కనిపిస్తుంది. కానీ పూజల్లో వాడరు. విష్ణుమూర్తికీ బ్రహ్మదేవుడికీ పెట్టిన పరీక్షలో- మొగలిపువ్వు బ్రహ్మదేవుడి తరపున అబద్ధపు సాక్ష్యం చెప్పడంతో, ఆగ్రహించిన శివుడు పూజకు పనికిరావని శపించాడట. అంతట ఆ పువ్వు క్షమించమని వేడుకోవడంతో శివరాత్రిరోజున మాత్రం పూజించవచ్చు అని సెలవిచ్చాడట. అందుకే ఈ పూలకు పెట్టింది పేరయిన ఒడిశాలోనూ ఆ రోజున ఒక్కో పువ్వు 300 నుంచి 700 రూపాయల ధర పలుకుతుందట.

కేతకి, గంధపుష్ప, కెవడా... ఇలా ఎన్నో పేర్లతో పిలిచే మొగలిపొద... ముళ్ల ఆకులతో వేలాడే వేళ్లతో గుబురుగా చిన్నపాటి చెట్టులా పెరుగుతుంది. ఈ మొక్కలో ఆడా మగా వేరుగా ఉంటాయి. మగపువ్వుని కేతకి విఫల, ఆడపువ్వుని స్వర్ణ కేతకి అంటారు. మగచెట్టు పువ్వులే సుగంధాన్ని వెదజల్లుతుంటాయి. ఆడచెట్టు పూలు వాసనరావు కానీ పండ్లుగా మారతాయి.

సుగంధాల రాణి!

మొగలి చెట్టు పొట్ట నుంచి పుష్పించే ఈ పువ్వు సువాసన వంద అడుగుల దూరం వరకూ వ్యాపిస్తుంది. దీని గుబాళింపు మనసుకి ఆహ్లాదాన్నీ నరాలకు సాంత్వననీ అందిస్తుంది. యాంటీ సెప్టిక్, యాంటీబ్యాక్టీరియల్ గుణాల్నీ కలిగి ఉండే మొగలిపూల తైలం కీళ్లనొప్పుల్నీ తగ్గిస్తుందట. మధుమేహం, జ్వరం, చెవినొప్పి, మూర్ఛ... ఇలా ఎన్నో వ్యాధుల నివారణలోనూ వాడుతుంటారు ఆయుర్వేదవైద్యులు. ఈ తైలం చర్మవ్యాధుల్నీ శరీర ఉష్ణోగ్రతనీ తగ్గిస్తుందనీ, మానసికవ్యాధులకు మందులా పనిచేస్తుందనీ చెబుతారు. కెవడా నీటిని క్లెన్సర్‌గానూ వాడతారు. ఈ నీటిని రసగుల్లా, రసమలై... వంటి స్వీట్ల తయారీలోనూ బిర్యానీల్లోనూ వేస్తుంటారు.

దేశంలోని పలు ప్రాంతాల్లో మొగలి పొదలు ఉన్నప్పటికీ ఒడిశాలోని గంజాం జిల్లాలోనూ ఒడిశా-ఆంధ్ర సరిహద్దుల్లోని ఇచ్ఛాపురం పరిసరాల్లో ఈ పూలను ఎక్కువగా సాగుచేస్తున్నారు. అక్కడి తీరప్రాంతపు నేల, వాతావరణం అనువుగా ఉండటంతో ఈ పొదలు సహజంగానే అక్కడ పెరుగుతాయి. సుమారు ఐదు వేల హెక్టార్లలో విస్తరించిన నలభై వేల పొదలకి ఏటా కోటికి పైగా పువ్వులు పూస్తే, అవన్నీ అక్కడున్న బట్టీల్లో తైలంగా మారుతున్నాయి. దేశంలోని ఈ పూల ఉత్పత్తులకు అవసరమైన ముడితైలంలో 90 శాతం గంజాం నుంచే ఎగుమతి అవుతోంది.


ఎలా చేస్తారు?

జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లోనే మొగలి పొదలు బాగా పూస్తాయి. కాబట్టి ఈ కాలంలోనే పూల నుంచి ఎక్కువగా తైలాన్ని తీస్తారు. అందుకోసం పూర్తిగా విచ్చుకుంటే వాసన పోతుందని ఉదయాన్నే పూలను ప్రత్యేకమైన కత్ర సాయంతో కోసేస్తారట. తరవాత ఇత్తడి లేదా కంచుపాత్రల్లో 300 నుంచి 500 పూలరేకుల్ని వేసి నీళ్లు పోసి మూతపెట్టి ఐదారుగంటలు మరిగిస్తారు. దాన్నుంచి వచ్చే ఆవిరి ఓ పొడవాటి గొట్టం ద్వారా చల్లని నీళ్లలో ఉన్న కంచు పాత్రలోకి వెళ్లేలా చేస్తారు. ఇలా సుమారు 30 వేల పువ్వుల్ని మరిగిస్తేగానీ ఒక లీటరు గాఢ తైలం రాదు. అందుకే సీజన్‌ను బట్టి దీని ధర రెండున్నర నుంచి తొమ్మిదిన్నర లక్షల రూపాయలు పలుకుతుంటుంది. అత్తరు తయారీలో గాఢ తైలం మూడు నుంచి ఐదు శాతం ఉంటే, కెవడా నీటిలో 0.02 మాత్రమే ఉంటుంది. ఈ తైలాన్ని అగరుబత్తీలూ సబ్బులూ సౌందర్య ఉత్పత్తుల తయారీలోనూ వాడతారు.

కేవలం పువ్వులే కాదు, ఈ ముళ్ల మొక్క ఆసాంతం ఉపయుక్తమే అంటారు స్థానికులు. ఆకులు, కాండం, వేళ్లలో ఉండే దృఢమైన పీచుతో కాగితాన్నీ చేస్తారు. బుట్టల్లాంటివీ అల్లుతుంటారు. అందుకే మరి... సంపన్నులకు పరిమళాల్ని పంచుతూ పేదవాళ్లకు పొట్ట నింపుతోన్న మొగలి పొద... ప్రకృతి మనిషికి ప్రసాదించిన గొప్ప ఔషధ సౌగంధం..! ★







వరమీయవమ్మా... వరమహా







శ్రావణమాసం... వ్రతాలూ నో
పూజలూ పేరంటాలతో సంద
కొత్త పెళ్లికూతుళ్లూ ముత్తైదువులు
పట్టుచీరలు కట్టుకుని నిండుగా న
కళకళలాడిపోతుంటారు. కో
వరాలనిస్తూ అష్టైశ్వర్యాలనూ ప్ర
ఆ వరమహాలక్ష్మినీ అంగరంగవైభవం
రించి, పవిత్ర పుష్పాలతోనూ షడ్రుచ
పూజించే దృశ్యం కడు శోభాయమా
ఉంటుంది. అందుకే ఏటికేడాదీ అమ్మ
అలంకరణకోసం అవసరమైన వస్తువ
పూజాసామగ్రీ అన్నీ రెడీమేడ్‌గా
మార్కెట్లోకి వస్తూనే ఉన్నాయి

అమ్మవారి అలంకారం

'శ్రీవరలక్ష్మీ దేవతాయై నమః ధ్యాయామి' అని ధ్యానిస్తూ సకల సౌభాగ్యాలూ సమకూరాలనీ కలకాలం సుమంగళిగా ఉండాలనీ కోరుకుంటూ వివాహిత స్త్రీలూ; మంచి భర్త రావాలని అమ్మాయిలూ శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఆరోజున ఉదయాన్నే అభ్యంగన స్నానం చేసి శ్రీమహాలక్ష్మి విగ్రహాన్ని స్వయంగా తయారుచేసుకుంటారు. కలశం మీద లేదా బిందెమీద కొబ్బరికాయ పెట్టి, దానికే కర్రను కట్టి, పట్టుచీరను అందంగా చుట్టి, పసుపుతో ఆ కాయను అమ్మవారి ముఖంగా మలిచి, బొట్టూ కాటుకా దిద్ది, తమకున్న నగలతో చక్కగా అలంకరించుకునేవారు గతంలో. అయితే అలా కట్టడం కొందరికి రాకపోవచ్చు. మరికొందరికి తీరికలేకపోవచ్చు. అందుకే చీరకట్టిన వరలక్ష్మీ బొమ్మలూ అలంకరించేందుకు నగలూ కిరీటాలూ రత్నఖచిత పాదాలూ చేతులూ సమస్తం నేడు దొరుకుతున్నాయి. దాంతో అచ్చం గుడిలోని దేవేరిలానే ఆ వరలక్ష్మిని అలంకరించి పద్మాసనంమీదనో మండపంలోనో కొలువుదీర్చుతున్నారు. కొందరు కేవలం ముఖాన్ని మాత్రమే పెట్టి చీర కట్టి పూజిస్తారు. అలాంటివాళ్లకోసం ఆభరణ శోభిత ముఖాలూ ఉంటున్నాయి. కాబట్టి 'అమ్మవారిని తయారుచేయడమంటే మాటలా' అంటూ ఒకటే హడావుడి పడిపోకుండా నిశ్చింతగా పూజ చేసుకోవచ్చు.



పూజా సామగ్రి

'సర్వ మంగళ మాంగళ్యే విష్ణువక్షస్
అంటూ వరలక్ష్మీదేవిని ఆవాహన చేసుకు
మాలతో కీర్తిస్తూ జరుపుకునే ఈ వ్రతాని
చేసుకు
నిత్యం
కానీ ప్ర
నిష్ట
పూజ
సుక



కుందన్ల రంగవల్లి

'శ్రీవరలక్ష్మీ నమస్తు వసుప్రదే సుప్రదే' అంటూ స్తుతిస్తూ ఆ శ్రీదేవిని కొలువుదీర్చిన పూజాపీఠం ముందు చూడచక్కగా రంగుల ముగ్గూ ఉండాల్సిందే కదా. అయితే అక్కడే కూర్చుని పూజ చేసుకునేటప్పుడు దానిమీద ఏవైనా పడినా లేదా పిల్లలు గభాల్న తొక్కినా అదంతా పాడైపోతుంది. పైగా ఆధునిక ఇళ్లలోని టైల్స్‌మీద రంగుల్ని అద్దడం కూడా కష్టమే. అందుకే ఇప్పుడు కాసుల్ని కురిపించే ఆ దేవి ముఖంతో కూడిన కుందన్ల ముగ్గులు నేరుగా వచ్చేస్తున్నాయి. అమ్మవారి అలంకరణకు ఏమాత్రం తగ్గకుండా రూపొందిస్తున్న ఈ ముగ్గుల్ని దాచిపెట్టుకుంటే అన్ని పండగలకీ వాడుకోవచ్చు. మధ్యలోని దేవి ముఖానికి బదులుగా ఆయా పండగలకి తగ్గ దేవీదేవతల బొమ్మల్ని మార్చుకుంటే చాలు!







వాయనం సమర్పయామి!

పూజానంతరం తోరం కట్టుకుని 'దాతవ్యం ద్వా
వాయనం హి ద్విజాతయే' అంటూ వాయన విధిని
తరవాతే ఆ పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పిన
ఆపై వీలునిబట్టి పూజయ్యాకనో సాయంత్రమో పే
ఆకూవక్కా గాజులూ జాకెట్టుముక్కలతో వాయనం
ఇప్పుడు అవన్నీ పెట్టేందుకు అందంగా అలంకరించి
బుట్టలూ కూడా చాలానే వస్తున్నాయి. వీటికి తమ
ప్రత్యేకత చాటుకునేలా దేవతల విగ్రహాలూ కుంకువ
భరిణెలు... వంటివీ చేరుస్తున్నారు. దాంతో వీటన్నింటినీ చక్కని కిట్ రూపంలో అమర్చి మరీ విక్రయిస్తున్నారు. వాటిని పేరంటాళ్లకు పంచి శాస్త్రోక్తంగా వ్రతాన్ని ఆచరిస్తున్నారు నేటి మహిళలు!

...క్ష్మి...!

...డడి.
...అంచుల
...ట్టుకుని
...వే
...వే
...ంక
...మా





సిరుల దేవత అలంకార ప్రీత్యర్థం..!

'పద్మాసనే పద్మకరే సర్వలోకైక పూజితే..' అని లక్ష్మీదేవిని స్తుతిస్తూ పూజించడమే కాదు, ఆమెకు ఎంతో ప్రీతికరమైన తామరపూలను పూజలోనూ పెడుతుంటారు. అయితే ఇప్పుడు ఏకంగా ఆ సిరితల్లిని కమలంలోనే కొలువు దీర్చేలా బంగారం, వెండితోపాటు మట్టి, ఫైబర్‌తో చేసిన కమల సింహాసనాలూ దొరుకుతున్నాయి. అలాగే విష్ణు మూర్తి, లక్ష్మీదేవి రూపాలుగా భావించి విగ్రహానికి రెండువైపులా రెండు అరటి పిలకలను తప్పనిసరిగా పెట్టి పూజిస్తుంటారు. కానీ వాటి మొదలు సరిగా లేకపోతే పడిపోతుంటాయి. అందుకే వాటిని ఉంచేందుకు ప్రత్యేకంగా స్టాండులు వస్తున్నాయి. అన్నిచోట్లా ఈ పిలకలు దొరకవు కాబట్టి అచ్చంగా పూజల్లో మంటపం దగ్గర పెట్టుకునేందుకు వీలుగా ప్లాస్టిక్కు చెట్లనీ తయారుచేస్తున్నారు. ఇక, అమ్మవారిని కొలువుదీర్చిన చోట వెనకగా పెళ్ళిళ్ళకు చేసినట్లే ఆకులూ పూలతో అందంగా అలంకరిస్తున్నారు. అంత తీరిక లేనివాళ్లకు ఆ తెరలూ వాటికి వేలాడదీసే దండలూ అన్నీ రెడీమేడ్‌గా లభిస్తున్నాయి.





...శోపచారాలూ అష్టోత్తర శతనా
...సరమైన పూజాసామగ్రిని ముందుగానే సిద్ధం
... అయితే ఈ తరం అమ్మాయిల్లో
...చేసే అలవాటు అందరికీ ఉండదు.
... మాత్రం తు.చ. తప్పకుండా నియమ
...ుకోవాలనుకుంటారు. కాబట్టి ఇంట్లో
...గ్రి అన్నీ ఉన్నాయో లేదో సరిచూ
...లేకుండా నూనె, ఒత్తులూ, అమ్మవారి ముఖమూ, కర్పూరం, అగరుబత్తులూ, పసుపూ కుంకుమా, చందనం... వంటివన్నీ ఓ కిట్ రూపంలో వస్తున్నాయి. ఇవే కాదు, పూజకు అవసరమైన కలశపు చెంబూ గిన్నెలూ ప్లేటూ దీపాలూ వంటివన్నీ కూడా వెండి, జర్మన్ సిల్వర్‌తో చేసిన సెట్ల రూపంలోనూ దొరుకుతున్నాయి. కాబట్టి ఇలాంటి ఓ సెట్ కొంటే చాలు... అన్ని పూజలకీ వాడుకోవచ్చు.





పూదండల్లో ఎన్ని రకాలో!

'మల్లికా జాజికుసుమైశ్చంపకైర్యకు శైరపి'... అంటూ మంత్రయుక్తంగా చెప్పడమే కాదు, ఆ దేవికి ఇష్టమైన మల్లె, జాజి పుష్పాలనూ మాలలు కట్టి మెడల్లో అలంకరిస్తారు. నిండుగా ఎన్ని నగలు పెట్టి ఎంత అందంగా తయారు చేసినా మెడలో పూలమాల వేయకపోతే మాత్రం నిష్ఠగా వ్రతమాచరించే భక్తులకు అస్సలు తృప్తిగా అనిపించదు. కానీ అన్ని వేళలా అన్నిచోట్లా అవి అందుబాటులో ఉండవు. కాబట్టి బట్టతోనూ దూదితోనూ కూడా అందంగా పూలదండల్ని అల్లేస్తున్నారు. చూడ్డానికివి నిజమైన పూలనే తలపిస్తున్నాయి. అంతే కాదు, కాసులు కురిపించే ఆ లక్ష్మీదేవిని తమ స్థోమతకొద్దీ వెండి, బంగారుపూలతోనూ పూజిస్తుంటారు. అయితే ఈమధ్య కేవలం విడి పూలతోనే సరిపెట్టకుండా వెండి బంగారు పూలదండల్నీ చేయించి మరీ వేస్తున్నారు. వీటిల్లోనూ మల్లె, మందారం, చామంతి... వంటి పూల ఆకారంలో ఎనామిల్ రంగులద్దిన వెండిపూలహారాలు ఎంతో అందంగానూ ఉంటున్నాయి!



...పం
...రించి అమ్మవారికి వాయనాన్ని ఇచ్చిన
... వ్రత కథను విని అక్షింతలు చల్లుకుంటారు.
...కు పూలూపండ్లూ పసుపూకుంకుమా
...ంబూలంగానీ ఇస్తారు. అయితే
...లూ



కదంబం



ఊరెళుతున్న పెంగ్విన్లు

పెంగ్విన్ ఆకృతిలో ఉండే రకరకాల బ్యాగులు మనకు దొరుకుతాయి. పిల్లలు ఎంతో ఇష్టంగా కొనుక్కునే ఆ బ్యాగుల్ని తగిలించుకుని నడుస్తుంటే చూడ్డానికి భలే ఉంటుంది. అదే బ్యాగుల్ని తగిలించుకుని నడుస్తున్న పెంగ్విన్లను ఎప్పుడైనా చూశారా. అదీ గుంపుగా పెంగ్విన్లు బ్యాగుతో నడుస్తుంటే ఎంత ముచ్చటగా ఉంటుందో కదా. అసలు విషయం ఏంటంటే... అంటార్కిటికా ఖండంలో కనిపించే పెంగ్విన్లు... బ్యాక్ ప్యాక్ బ్యాగులు తగిలించుకుని నడుచుకుంటూ వెళుతున్న వీడియో ఒకటి ఈ మధ్య వైరల్ అయింది. అసలే పెంగ్విన్లు ముద్దుగా ఉంటాయి. అలాంటిది ఆ పక్షులే రంగు రంగుల సూట్‌కేస్ బ్యాగులతో వయ్యారంగా నడుస్తుంటే ఇంకెంత బాగుంటుందో కదా. పర్యావరణవేత్తలు పెంగ్విన్లపైన అధ్యయనం చేస్తున్న సమయంలో ఓ బ్యాగుల తయారీ సంస్థ- మినీ బ్యాగులతో వాటిని అలంకరించినప్పుడు తీసిన వీడియో వైరల్ కావడంతో ఆ పెంగ్విన్లు అందరి దృష్టినీ ఆకర్షించాయి.

దారిమళ్లితే పంక్చరే!

రోడ్లపైన యూటర్న్ వరకూ వెళ్లి మలుపు తీసుకోవడానికి- సమయం పడుతుందనో, పెట్రోలు ఆదా చేద్దామనో, త్వరగా వెళ్లాలనే ఉద్దేశంతోనో చాలామంది రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తుంటారు. అలా ప్రయాణించే వాహనదారులు ఇతరులకు ఇబ్బంది కలిగించడంతోపాటు కొన్నిసార్లు ప్రమాదాలకూ కారణమవుతుంటారు. ఈ మధ్య అహ్మదాబాద్‌లో రాంగ్‌రూటులో ప్రయాణించిన ఓ వాహనం తొమ్మిదిమంది ప్రాణాలను బలిగొంది. దాంతో అలాంటి వాళ్లలో మార్పు తీసుకురావడానికి ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై టైర్‌కిల్లర్లను ఏర్పాటు చేశారు. అంటే- ఓ ఇనుప షీటుపైన పదునైన మొనతేలిన బ్లేడులు ఉంటాయి. రాంగ్‌రూటులో వచ్చే వాహనాల



టైర్లలో దిగబడి పంక్చరు చేసేలా అమర్చి ఉంటాయి. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అక్కడక్కడా ఈ టైర్ కిల్లర్లను ఏర్పాటు చేశారు అధికారులు. మరి టైరు పంక్చరైనా, పేలినా ఇబ్బందే కాబట్టి వాహనదారులు సరైన దారిలో వెళుతున్నారు. పథకం ఫలించడంతో గుజరాత్ రాష్ట్రమంతా ఇలాంటివి ఏర్పాటు చేయాలనుకుంటున్నారు.





44వ అంతస్తులో రోల్స్ రాయిస్



చాలా మంది బాల్కనీలో బట్టలు ఆరేసుకుంటారు. కొందరు కాఫీ టేబుల్ వేసుకుని సూర్యోదయం, సూర్యాస్తమయాల్ని ఆస్వాదిస్తుంటారు. కాస్త అభిరుచి ఉన్నవారు రకరకాల కుండీలను ఏర్పాటు చేసి బాల్కనీ అంతటా పచ్చదనం పరిచేస్తుంటారు. అయితే ఎక్కడైనా బాల్కనీలో- అదీ 44వ అంతస్తులో కారును పార్కు చేయడం చూశారా? పోనీ విన్నారా? ఊహకు కూడా అందని ఆ దృశ్యాన్ని చూడాలంటే మాత్రం చైనాలోని వూజియాన్ నగరానికి వెళ్లాల్సిందే. రోల్స్ రాయిస్ కొనాలన్నది ఓ వ్యాపారవేత్త కల. గత నెల్లోనే కోట్లు పెట్టి కొనుగోలు చేసిన ఆ కారును అపార్ట్‌మెంట్‌కి తీసుకొచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. కేవలం కొనుగోలు చేసి- దాన్ని చూస్తూ మురిసిపోవాలనుకున్న ఆ కోటీశ్వరుడు ఓ ఇంజినీరింగ్ సంస్థ సాయంతో దాన్ని 44వ అంతస్తులోని తన బెడ్‌రూమ్ బాల్కనీలో పెట్టించుకున్నాడు. అందుకయ్యే ఖర్చుతో మరో రోల్స్‌రాయిస్ కూడా కొనొచ్చుట. కారు కొనడం సరే దాన్ని బాల్కనీలో పెట్టడమే కాస్త విడ్డూరంగా ఉంది కదూ!

ఫిట్‌గా ఉండకపోతే ఫట్!

సినిమాల్లో పోలీసులు కండలు తిరిగి, సిక్స్ ప్యాక్ బాడీతో చూడ్డానికి భలే ఫిట్‌గా ఉంటారు. అదే మనచుట్టూ ఉండే చాలా మంది పోలీసులు అందుకు భిన్నంగా కనిపిస్తారు. డ్యూటీలో భాగంగా పని ఒత్తిడిలో తీరికలేకుండా గడిపే పోలీసులు చాలామంది ఫిట్‌నెస్ పరంగా దృష్టి పెట్టక బరువు పెరుగుతుంటారు. దానివల్ల రకరకాల సమస్యలు వాళ్లని వేధిస్తుంటాయి. అందుకే పోలీసులు ఫిట్‌గా ఉండాలి తప్ప పొట్టలేసుకుని ఉండకూడదని భావించింది అసోం ప్రభుత్వం. ఇకమీదట పోలీసులు బరువు తగ్గి ఫిట్‌గా ఉండాలనీ- ఎత్తు, వయసుకు తగ్గ బరువు ఉండాలనీ ఆదేశాలు జారీ చేశారు. అందుకోసం మూడు నుంచి ఆరునెలల సమయమిచ్చారు. ఆ లోపు ఫిట్‌గా మారకపోతే వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోవాల్సిందేనట. థైరాయిడ్, మరికొన్ని సమస్యలతో బాధపడుతున్నవారు మాత్రం ఇందుకు మినహాయింపు. దాంతో పోలీసులు కొవ్వు కరిగించే పనిలో పడ్డారు.



త్వరలో ఆ రాష్ట్ర డీజీపీతోనే బీఎమ్ఐ పరీక్షలు మొదలుపెట్టనున్నారు. ఈ పరీక్షల్లో ఫెయిలైతే పోలీసులకు మరొక్క అవకాశమే ఇస్తారట.

ఓ సూపర్‌స్టార్‌స్థాయి హీరో సినిమాలో... ప్రేక్షకుల్ని ఈలలేయించడం కష్టమేంకాదు! స్టార్ తెరపైకి రాగానే విజిల్స్ సహజంగానే మిన్నంటుతాయి. కానీ అలాంటి అభిమానులతోపాటూ విమర్శకుల్నీ మెప్పించడం... చూసినవాళ్ళందరూ 'దర్శకుడి టచ్ బావుంది' అనుకోవడం చాలా అరుదు. 'జైలర్' సినిమాతో యువదర్శకుడు **నెల్సన్** ఆ ఘనత సాధించాడు! అతని టేకింగ్‌లాగే... సినిమా రంగంలోకి నెల్సన్ నడిచొచ్చిన తీరుకూడా చాలా విభిన్నమైంది. అది అతని మాటల్లోనే...



'జైలర్' నుంచి నన్ను తీసేయమన్నారు!

తమిళనాడులోని వేలూరు మాది. నాన్న రేడియో నాటకాలు రాసేవారు. చిన్నప్పటి నుంచీ ఇంట్లో ఎక్కువగా ఆ కథలే వినిపించేవి. మరీ ఎక్కువైతే ఏ గొప్ప విషయమైనా వెగటు పుట్టిస్తుందేమో..! నాకు కథలన్నా, సినిమాలన్నా పెద్దగా నచ్చేవి కావు. ఇంజినీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలని కలలుకనేవాణ్ణి. ఇంటర్‌లో అందుకు తగ్గట్టే కష్టపడ్డాను. కానీ నాకు 80 శాతం మార్కులొచ్చినా... ఇంజినీరింగ్‌లో మెరిట్ సీటు రాలేదు. ప్రైవేటు కాలేజీలో చేరే స్థోమత లేదు. ఇంజినీరింగ్ అవకాశం పోయిందని బాధపడుతున్న నన్ను... మా నాన్న బీఎస్సీ విజువల్ కమ్యూనికేషన్ కోర్సులో చేర్చారు. చెన్నైలో సినిమాలవైపు వెళ్ళాలనుకునేవాళ్ళు చేరే కోర్సు అది. నాకేమో ఆ క్లాసులు బొత్తిగా అర్థమయ్యేవి కావు. 'ఇంట్లోనూ సినిమా... ఇక్కడా సినిమా ఏంట్రా బాబూ!' అని తలపట్టుకునేవాణ్ణి. ఓ దశలో కాలేజీ మానేస్తానంటే- 'నిన్ను మెకానిక్ షెడ్డులో చేరుస్తా... జాగ్రత్త' అని బెదిరించారు నాన్న. దాంతో తప్పదనుకుని- ఆ కోర్సుని కేవలం పరీక్షల కోసమని చదవడం మొదలుపెట్టాను. అప్పట్లో ఓ ప్రాజెక్టు కోసం స్టీవెన్ స్పీల్‌బర్గ్ సినిమాలు కొన్ని చూడాల్సి వచ్చింది. అన్నీ నాకు నచ్చకున్నా ఒకట్రెండు కట్టిపడేశాయి. వాటి టేకింగ్ శైలి తెలుసుకుందామని మళ్ళీమళ్ళీ చూడసాగాను. అలా నాకు తెలియకుండానే మనసు సినిమాలవైపు మొగ్గసాగింది...

దర్శకుణ్ణయిపోయాకానీ...

డిగ్రీ తర్వాత ఓ టీవీ ఛానెల్‌లో ఉద్యోగం వచ్చింది. కొన్ని కార్యక్రమాలకి సహాయ దర్శకుడిగా చేశాను. నేను కామెడీ రాస్తున్న తీరు నచ్చి కొన్ని కార్యక్రమాలకి నన్నే డైరెక్ట్ చేయమన్నారు. అలా చేసిన 'సూపర్ సింగర్' షోకి మంచి గుర్తింపొచ్చింది. అప్పట్లో దానికి- శివకార్తికేయన్ యాంకర్‌గా ఉండేవాడు. మేం రూమ్మేట్స్ అయ్యాం. అతను సినిమాల కోసం ప్రయత్నిస్తూ ఉంటే నేనూ వెళ్ళేవాణ్ణి. నాకు సహాయదర్శకుడిగా చేసే అవకాశం వచ్చింది. కొంతకాలం తర్వాత సింబు హీరోగా 2010లో ఓ సినిమా మొదలుపెట్టాను. అందులో హన్సిక నాయిక. కానీ- సగం సినిమా చేశాక ఆర్థిక సమస్యలతో నిర్మాత చేతులెత్తేశాడు. ఎంతగా ఇష్టంలేదంటూ ఈ రంగంలోకి వచ్చినా... చేస్తున్న సినిమా ఉన్నపళంగా చేయిజారితే ప్రాణం విలవిల్లాడిపోదూ! నా పరిస్థితీ అదే. పోనీ మళ్ళీ సహాయదర్శకుడిగానే చేద్దామనుకుంటే, అందుకూ అవకాశం రాలేదు. దాంతో పాత టీవీఛానెల్‌లోనే ఉద్యోగానికి వెళ్ళడం మొదలుపెట్టా. ఈలోపు శివకార్తికేయన్ హీరో అయిపోయాడు. అతని ద్వారా సంగీతదర్శకుడు అనిరుధ్ నాకు మంచి ఫ్రెండయ్యాడు. అప్పుడప్పుడూ అతని స్టూడియోకి వెళ్ళి కూర్చునేవాణ్ణి. ఓరోజు అతనేదో చికాకులో ఉండి నన్ను 'ఖాళీగా ఇక్కడ తిష్ఠ వేయకపోతే... ఏదైనా కథ రాయొచ్చుకదా!' అన్నాడు. ఆ మాటలకి నాకు చాలా ఉక్రోషం వచ్చింది. ఆ రోషంతోనే 'కొ..కొ... కోకిల' సినిమా కథ రాసుకున్నాను. డ్రగ్ స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే డార్క్ హ్యూమర్ అది. ఆ కథ అనిరుధ్‌కి వినిపిస్తే... అప్పటికప్పుడు లైకా నిర్మాతకి ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేశాడు. వాళ్ళు ఆ కథకి నయనతారని హీరోయిన్‌గా ఎంపికచేశారు! సినిమా ఊహించని విజయం సాధించింది. ఆ తర్వాత నా ఫ్రెండ్ శివకార్తికేయన్ కోసం 'వరుణ్ డాక్టర్' సినిమా చేశాను. అదీ హిట్ కావడంతో... తమిళ మెగాస్టార్ విజయ్ నుంచి పిలుపొచ్చింది. అలా 'బీస్ట్' చిత్రం పట్టాలకెక్కింది.



కసిగా చేశా...

విజయ్ చిత్రం చివరి షెడ్యూల్‌లో ఉన్నప్పుడే రజినీకాంత్‌కి కథ చెప్పే అవకాశం దక్కింది. 'బీస్ట్'ని ముగించాక 'జైలర్' మొదలుపెట్టాను. ఈలోపు 'బీస్ట్' విడుదలై మిశ్రమ స్పందనొచ్చింది. సినిమా పెద్దలు చాలామంది నన్ను జైలర్ ప్రాజెక్టు నుంచి తీసేయాలంటూ రజినీకాంత్‌కి సలహాలివ్వడం మొదలుపెట్టారు. ఆయన అవేవీ చెవికెక్కించుకోలేదు. 'మీకే ఒత్తిడీ లేదు... మీరు కోరుకున్నట్టే సినిమా తీయండి సార్' అంటూ ధైర్యం చెప్పారు. ఆ దన్నుతో కసిగా పని చేశాను. నాకోసమూ, నేను ఎంతగానో ఆరాధించే సూపర్‌స్టార్ కోసమూ హిట్టు సాధించి తీరాలని శ్రమించాను. సినిమా పూర్తిచేశాక... అది రిలీజయ్యే గురువారం(ఆగస్టు 10) కోసం ఉత్కంఠగా ఎదురుచూశాను. నేను ఊహించినదానికన్నా పెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది 'జైలర్.' ఈ చిత్రం విడుదలకు ముందే హిమాలయాలకి వెళ్ళిపోయిన రజినీ... అక్కడి నుంచి ఫోన్ చేశారు. 'అదరగొట్టేశాం మనం!' అని ఆయన చెబుతూ ఉంటే... ఆనందంతో నాకు కన్నీళ్ళు ఆగలేదు!

– టీ. ఉదయ్‌కుమార్, న్యూస్‌టుడే, చెన్నై

అందమైన జీవితం

– సి.ఎన్. చంద్రశేఖర్

"నందూ... మానస తిరుపతి వచ్చిందిరా. నిన్న అన్నయ్య ఇంటికి వెళ్ళినప్పుడు చూశా. వచ్చి వారం రోజులయిందట" అంది రోహిణి కొడుకుతో.

"అలాగా, ఎలా ఉంది మనూ?" నందూ అడిగాడు.

"ఎప్పటిలా లేదు. ఎందుకో కాస్త డల్‌గా కనిపించింది. మనిషి కూడా తగ్గింది."

"అయ్యో... నేను వెళ్ళి ఒకసారి మాట్లాడి విషయం కనుక్కుంటాను."

"అంత అవసరం లేదులే. తను నిన్ను కాదన్న విషయం మరచిపోయావా?"

"అమ్మా, తను నా భార్య కాకున్నా మామ కూతురేగా. మన కుటుంబంలోని ఆడబిడ్డేగా. అమ్మా... నువ్వు అన్ని విషయాల్లో పాజిటివ్‌గా ఉంటావు. మనూ విషయంలో మాత్రం వేరేగా ఉంటావు. చిన్నప్పట్నుంచీ నాతో కలసి తిరగడం వల్ల భర్త అనే భావన కలగలేదని చెప్పింది. ఆ కారణం సబబుగానే ఉంది కదా."

"ఉంది. కానీ దాన్ని నా కోడలిగా చేసుకోవాలని ఎంతో ఆశపడ్డానురా!"

"అవన్నీ ఇప్పుడెందుకమ్మా. తనకు పెళ్ళైంది, నాకూ పెళ్ళైంది. అందరం హాయిగా ఉన్నాం. బంధాలు నిలుపుకున్నాం. అవసరమైతే ఒకరికొకరు సహాయపడదాం."

శ్యామల కొడుకు వైపు అభినందన పూర్వకంగా చూస్తూ "నీకు ఇంత మంచితనం ఎక్కడ నుంచి వచ్చిందిరా?" అంది.

"మీ నుంచే అమ్మా. నన్ను బాధపెట్టిన వారిపట్ల నువ్వు కాస్త కోపంగా ఉంటావుగానీ నిజానికి నీ మనసు వెన్న. ఇక నాన్నంటావా... నీకంటే మంచివారు. ఎవరి జోలికీ పోరు. తన దగ్గరకు వచ్చిన వారిని ఎంతో గౌరవిస్తారు."

"నువ్వు చదివిన పుస్తకాలు కూడా ఓ కారణమే! మనుషులు నేర్పని సంస్కారం పుస్తకాలు నేర్పుతాయి. మంచి పుస్తకాలకు ఉన్న గొప్ప గుణం అది."

"పుస్తకాలు చదివే అలవాటు నాకు నాన్న నుంచి వచ్చింది" అన్నాడు నవ్వుతూ.

"రేయ్... నేనూ పుస్తకాలు చదువుతాను!" చిరుకోపంతో అంది రోహిణి.

"నాన్నంత కాదులే" అంటూ నవ్వి, "నేను వెళ్ళి మనూతో మాట్లాడి వస్తాను అమ్మా" అంటూ బయలుదేరాడు ఆనంద్.

ఆనంద్ వెళ్ళేసరికి మంచంపై పడుకుని ఉంది మానస. ఆనంద్‌ని చూడగానే లేచి నిలబడి "హాయ్, నందూ... రా కూర్చో" అంది అక్కడున్న కుర్చీ లాగుతూ.

ఆనంద్ కూర్చున్నాక "అదేమిటి మనూ, అలా అయిపోయావు? ఆరోగ్యం బాగాలేదా?" అని అడిగాడు ఆదుర్దాగా చూస్తూ.


"నీకూ అలాగే కనపడుతున్నానా?" అంది నవ్వుతూ.

"ఏం జరిగింది మనూ?"

"నువ్వు మేడ మీదికెళ్ళి కూర్చో. నేను కాఫీ తీసుకొస్తాను"

మానసకు తన తల్లి ముందు మాట్లాడటం ఇష్టంలేక తనని మేడ పైకి వెళ్ళమని చెబుతోందని అతనికి అర్థమైంది.

ఆ ఇంటి మేడ పైన బాల్కనీ అతనికి చిన్నప్పట్నుంచీ ఇష్టం. అక్కడ నిలబడి చూస్తే రాములవారి ఆలయ గోపురం, తిరుమల కొండమీది మెట్ల మార్గం కనిపిస్తాయి. ఆ దృశ్యాలు మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తాయి అతనికి. అయితే ఇప్పుడు మాత్రం అతని మనసంతా మానస చెప్పబోయే విషయం మీదే ఉంది.



"నందూ... కాఫీ" అన్న మానస పిలుపు విని తల తిప్పి చూశాడు. మానస అతనికి దగ్గరగా నిలబడి ఉంది.

"థాంక్యూ" అన్నాడు కప్పు అందుకుంటూ. తర్వాత "రా, అలా కూర్చుని మాట్లాడుకుందాం" అంటూ అక్కడ ఉన్న సిమెంటు బల్ల మీద కూర్చున్నాడు. మానస అతని ఎదురుగా ఉన్న బల్లపైన కూర్చుంది.

"చెప్పు మనూ... ఏమైంది?"

"రాజుకూ నాకూ అభిరుచుల్లో చాలా తేడా ఉంది నందూ. అతనితో ఇక ఉండలేను. డైవోర్స్‌కి అప్లై చెయ్యాలనుకుంటున్నాను. నువ్వుండగా వేరే లాయరెందుకని నీతో మాట్లాడాలనుకున్నాను. ఇంతలో నువ్వే వచ్చావు."

"అంత తొందరెందుకు మనూ?"

"తొందరా... మా పెళ్ళై సంవత్సరం దాటింది తెలుసా?"

"అతనిలో నీకేం నచ్చలేదో చెప్పు."

"చాలా ఉన్నాయి. అతనిలో నచ్చిన వాటికంటే నచ్చనివే ఎక్కువ."

"ఓకే. ముందుగా మనందరికీ అతనిలో నచ్చిన పాయింట్స్ గురించి మాట్లాడదాం, సరేనా?"

అలాగేనన్నట్టు తలూపింది మానస.

"అతను అందగాడు. అవునా?"

మళ్ళీ తలూపింది మానస.

"చదువుకున్నవాడు, మంచి ఉద్యోగం, మంచి జీతం ఉన్నవాడు, మంచి కుటుంబం నుంచి వచ్చాడు."

"అవును. ఇవే అతనిలోని పాజిటివ్ అంశాలు."

"ఇవి చూసే మీ అమ్మానాన్నలు అతన్ని నీకిచ్చి పెళ్ళి చేయాలనుకుని ఉంటారు. ఏ తల్లిదండ్రులైనా తమ కాబోయే అల్లుడిలో ఈ లక్షణాలే చూస్తారు కదా!"

"అంతేగా! ఇవి చూసే నేనూ ఒప్పుకున్నాను. అయితే సంవత్సరం కాపురం చేశాక తెలిసింది అతను నాకు సరిజోడు కాదని."

"సరే. ఇప్పుడు అతని నెగటివ్ క్వాలిటీస్ గురించి చెప్పు."

"నన్ను బయటికి తీసుకెళ్ళడు. నా వంటని మెచ్చుకోడు. ఎంతసేపూ పని పని అంటూ ఉంటాడు. నేను మంచి డ్రెస్సు వేసుకుంటే బాగుందని చెప్పడు. ఆఫీసులో నాకు మంచి పేరు వచ్చినా, మెచ్చుకోలు వచ్చినా ఆ విషయం అతనితో పంచుకుంటే కనీసం సంతోషం అని కూడా అనడు."

"అంతేనా?" ఆమె ఆగడం చూసి అడిగాడు ఆనంద్.

"ఇంకా ఉన్నాయి. గుర్తు రావడం లేదు."

"సరే. నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను... జవాబివ్వు."

అడగమన్నట్టు చూసింది మానస.

"అతనికి సిగరెట్టు, మందు తాగడం అలవాటుందా?"

"అస్సలు లేదు."

"అమ్మాయిల పిచ్చి?"

"లేదు"

“ఇంటి పనుల్లో నీకు సహాయం చేస్తాడా?”

“వంటపనిలో చేయడు. అయితే మిగిలిన పనంతా అతనే చేస్తాడు. ఆ విషయంలో నాకు కంప్లైంట్స్ లేవు.”

“అతనిలో ఇన్ని మంచి క్వాలిటీస్ ఉంటే కొన్నే ఉన్నాయన్నావు. నువ్వెంత అదృష్టవంతురాలివో నీకు అర్థమవుతోందా మనూ?” ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు ఆనంద్.

“నువ్వు మగవాడివి నందూ. ఆడదానివై ఉంటే నీకు నా బాధ అర్థం అయ్యేది.”

“నిన్ను నేను అర్థం చేసుకున్నాను మనూ. నువ్వే జీవితాన్ని అర్థం చేసుకోలేదు. మనం కోరినవన్నీ మనకు దొరకవు. దొరికిన దాంతో రాజీపడాలి. ముఖ్యంగా ఓపికతో ఉండాలి. కొంతకాలానికి అతనిలో మార్పు రావొచ్చు లేదా నీకే ఇవన్నీ చిన్నచిన్న విషయాలుగా తోచవచ్చు. భవిష్యత్తులో ‘ఈమాత్రం దానికే విడాకులు తీసుకుందామనుకున్నానే’ అని నువ్వు నవ్వుకోవచ్చు.”

“నాకంత ఓపికలేదు. మా కొలీగ్స్ భర్తల్ని చూస్తుంటే నాకు ఎంత బాధగా ఉంటుందో తెలుసా? వాళ్ళు భార్యని షాపింగ్‌కి తీసుకెళ్ళి కోరినవి కొనివ్వడం, ఊళ్లు తిప్పడం, పదిమంది ముందూ భార్యని పొగడటం చేస్తుంటారు. నేను అలాంటి అదృష్టానికి నోచుకోలేదు” కళ్ళనీళ్ళతో అంది మానస.

“పక్కవాళ్ళతో పోల్చుకోవడం వల్లే చాలా సంసారాలు పాడవుతున్నాయి. పైకి అలా కనిపిస్తుంటారు కానీ వాళ్ళమధ్య ఎన్ని సమస్యలున్నాయో మనకు తెలియవు కదా. పోనీ విడాకులు తీసుకుంటావనే అనుకుందాం. తర్వాతేం చేస్తావు? ఇంకొకర్ని చేసుకుంటావు. అతనిలో కూడా నీకు నచ్చని కొన్ని విషయాలుంటాయి. అప్పుడేం చేస్తావు? పెళ్ళి చేసుకోకుండా ఉండిపోతానంటావేమో... అంతకంటే ఇప్పుడున్న పరిస్థితి మేలు కదా.”

మానస ఆలోచిస్తూ ఉండిపోయింది.

“అతను తాగుబోతు అయి ఉండి నిన్ను ఇబ్బంది పెట్టినా, పరాయి స్త్రీలతో తిరుగుతున్నా నేనే నీకు విడాకులు ఇప్పించేవాణ్ణి. నువ్వు చెప్పిన కారణాలు విడాకులు తీసుకునేంత పెద్దవి కావు.”

“అతను తాగుబోతు కాకపోవచ్చు, తిరుగుబోతు కాకపోవచ్చు. కానీ, మనసుకు తగ్గవాడు కాదు. నేను చదువుకున్నాను, ఉద్యోగం చేస్తున్నాను. పాతకాలం స్త్రీలాగా ‘ఎవడో ఒకడు భర్తగా ఉన్నాడు, అతని పాదసేవ చేసుకుంటూ బతికేస్తాను’ అనుకునే తరం కాదు మాది. మా అభిరుచులకు తగినవాడిని, మా మనసును అర్థం చేసుకుని ప్రవర్తించే వ్యక్తినే భర్తగా గౌరవిస్తాం.”


“పెళ్ళికి ముందు నువ్వు ఇవన్నీ అతనితో చర్చించి ఓ నిర్ణయం తీసుకోవాల్సింది. పెళ్ళయ్యాక నేను చెప్పిన కారణాల వంటివి ఉంటే తప్ప, విడాకులు తీసుకోవడం అంత సులభం కాదు. ఈ సంవత్సరానికే అతనితో నీకు అంతో ఇంతో అనుబంధం ఏర్పడి ఉంటుంది. నీలోని అసంతృప్తి నీచేత ఇలా అనిపిస్తోంది కానీ, విడాకుల వరకూ వస్తే నువ్వే బాధపడతావు.”

“అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు?”

“నువ్వు అతనిలోని లోపాల గురించే ఆలోచిస్తున్నావు. నీలోని లోపాల గురించి నువ్వెప్పుడైనా ఆలోచించావా? నువ్వు అతనికి సరైన జోడీనా కాదా అని ప్రశ్నించుకున్నావా?”

లేదన్నట్టు తల అడ్డంగా ఊపింది మానస.

“అయితే ఆలోచించు. వీలైతే అతన్నే ఆ ప్రశ్న అడుగు. నేనోసారి హైదరాబాద్ వస్తాను. అప్పుడు మనం ఓ నిర్ణయం తీసుకుందాం. అంతవరకూ అతనిలోని పాజిటివ్ విషయాల గురించే ఆలోచించు, అతన్ని బాగా గమనించు. ఇక్కడ మాత్రం ఏమీ ఆలోచించొద్దు. రాకరాక పుట్టింటికి వచ్చావు, హాయిగా ఎంజాయ్ చెయ్యి”



అంటూ లేచాడు ఆనంద్.

ఆనంద్ వెళ్ళిపోయాక అతను చెప్పిన విషయాల గురించే ఆలోచించసాగింది మానస. రాజేష్ గురించి తన తల్లిదండ్రులకు చెబితే వాళ్ళు రాజేష్‌పై కోపగించుకున్నారు. విడాకులు తీసుకుంటానంటే ఆలోచిద్దామన్నారు. బహుశా తనపై ఉన్న ప్రేమవల్లే వాళ్ళు తనని సమర్థించి ఉండవచ్చు. కానీ, నందూ ఎంత బాగా సమస్యని విశ్లేషించాడు! అతను చెప్పినట్లు తను కొద్దిరోజులు ఆగడం మంచిది.

నందూ తనని పెళ్ళి చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాడని అమ్మ ఓసారి చెప్పింది. అయితే, చిన్నప్పట్నుంచీ కలిసి ఆడుకోవడం వల్ల తనకు అలాంటి భావనే లేదని తాను చెప్పింది. నందూ తప్పక బాధపడి ఉంటాడు. కానీ, ఇప్పుడు తను బాధలో ఉంటే ‘తనను కాదన్నందుకు అనుభవించనీ’ అని ఊరుకోలేదు అతను. రాజేష్‌పై మరింత నూరిపోసి తమను విడగొట్టే ప్రయత్నం కూడా చేసి ఉండవచ్చు. పైగా లాయరుగా అతనికి ఓ కేసు కూడా దొరికేది. కానీ, తామిద్దరూ కలిసి ఉండేందుకే అతను ప్రయత్నించాడు. రాజేష్‌లో తనకు కనిపించని కొత్త కోణాల్ని తన దృష్టికి తెచ్చి ఆలోచించుకునే అవకాశం ఇచ్చాడు. ‘నందూ... నీ మంచితనానికీ మనిషితనానికీ హ్యాట్సాఫ్’ అనుకుంది మానస.

★ ★ ★

తను ప్రయాణిస్తున్న ట్రైన్ హైదరాబాదుకు దగ్గరవుతూంటే ‘స్టేషన్‌కి వచ్చి రిసీవ్ చేసుకుంటాడేమో’ అని ఆశపడింది మానస. అయితే అతను రాలేదు. నిరుత్సాహంగా క్యాబ్ బుక్ చేసుకుని ఇల్లు చేరింది. తలుపు తీసిన రాజేష్ కళ్ళలో వెలుగు కనిపించింది ఆమెకి. త్వరగా ఫ్రెష్‌అప్ అయి ల్యాప్‌టాప్ ముందు కూర్చుంది.

అతను కాఫీ తయారుచేసి ఆమె చేతికిచ్చాడు. “థాంక్యూ” అంటూ ఆనందంగా అందుకుంది.

“రాజూ... కాస్త టిఫిన్ ఆర్డర్ చేస్తారా?” అని అడిగింది కాఫీ తాగుతూ.

“నేను ఉప్మా చేశాను.”

ఆశ్చర్యంగా అతనివైపు చూసి “మీకు ఉప్మా చేయడం వచ్చా?” అని అడిగింది.

“నేను చెన్నైలో పనిచేస్తున్నప్పుడు మా అమ్మ దగ్గర నేర్చుకున్నాను” అన్నాడు.

తర్వాత ఆలోచిస్తే అతను స్టేషన్‌కి రాకపోవడంలో న్యాయం ఉందనిపించింది. ‘తనకంటే అతనికి ఆఫీసు పని ఎక్కువ. తనని రిసీవ్ చేసుకోవాలంటే అతను తొందరగా లేవాలి. అంత దూరం ప్రయాణించాలి. తర్వాత మళ్ళీ తిరుగు ప్రయాణం. అప్పుడే అలసిపోతే రాత్రి పదకొండు వరకూ పని ఎలా చేస్తాడు? పైగా ఉదయాన్నే అతనికి కాల్స్ ఉంటాయి. అందుకే అతను స్టేషన్‌కి రాలేదు. కాల్స్ చూసుకుంటూ కాఫీ, టిఫిన్ చేయడం వల్ల తనకు పని తగ్గింది. ఎటూ క్యాబ్ బుక్ చేసుకుని తను రాగలదు’ అనుకుంది.

చాలాకాలం తర్వాత ఓరోజు ఆఫీసులో అడుగు పెట్టింది మానస. కొవిడ్ నేపథ్యంలో ఇంటి నుంచే ఆఫీసు పని చేసింది ఇన్నాళ్ళూ. ఆ రోజంతా తన కొలీగ్స్‌తో మాట్లాడుకుంటూ, పని చేసుకుంటూ ఆహ్లాదంగా గడిపింది.

“కొవిడ్ సమయంలో మమ్మల్ని పిలవకుండా పెళ్ళి చేసేసుకున్నావ్. కాబట్టి, మాకు పార్టీ ఇవ్వాలి” అంది కొలీగ్ మమత.

“ఇంకా కొవిడ్ పూర్తిగా పోలేదుగా. నెమ్మదిగా ఇస్తాలే” అంటూ అప్పటికి ఆ విషయం దాటవేసింది.

లంచ్ సమయంలో కొలీగ్స్ మాటల వల్ల వాళ్ళలో చాలామంది తమ వైవాహిక జీవితంలో అంత సంతోషంగా లేరని కొద్దిరోజుల్లోనే అర్థమైంది ఆమెకి.

సరయు భర్త తాగుబోతు. సంపాదించిన డబ్బంతా తాగుడుకే ఖర్చు పెట్టేస్తాడు. మాధవి తన భర్త కేబరే డ్యాన్స్‌లు చూడ్డానికి వెళ్తూంటాడని వాపోయింది. ప్రేమించి పెళ్ళి చేసుకున్న లత అత్తమామల ఆరళ్ళకు గురవుతోంది. ఆమె భర్త కూడా తన తల్లిదండ్రులకే సపోర్ట్ చేస్తుంటాడు.

చాలామంది మగ కొలీగ్స్ భేషజాలకు పోయి తమ ఆదాయంకంటే ఖర్చులు ఎక్కువ చేసి, మానసను అప్పు అడగటం, ఆమె లేదని చెప్పడం జరుగుతోంది.

అలాంటి సందర్భాల్లో ఆమెకి రాజేష్ గుర్తొస్తున్నాడు. 'రాజు డబ్బు విషయంలో జాగ్రత్తగా ఉంటాడు. దుబారా ఖర్చులు చెయ్యడు. దురలవాట్లు ఎటూ లేవు. భవిష్యత్తు అవసరాల కోసం చక్కటి ప్లానింగ్ చేస్తాడు' అనుకుంది.

★ ★ ★

ఓరోజు మానస గర్భవతని తెలిసింది. ఈ వార్త తెలియగానే మానసకంటే ఎక్కువగా రాజేష్ ఆనందించాడు. విషయం తెలిసి తల్లిదండ్రులు ఆమెని చూడటానికి వచ్చారు.

"అమ్మని ఇక్కడే ఉంచుకుంటాను. ఇంటిపనీ ఆఫీసుపనీ ఈ పరిస్థితుల్లో చేసుకోలేను" అంది రాజేష్‌తో మానస.

"మీ నాన్నగారు ఇంకా ఉద్యోగంలో ఉన్నారు. ఆయన ఇక్కడ ఎక్కువ రోజులు ఉండలేరు. ఈ వయసులో ఆయన అక్కడ ఒంటరిగా ఎలా ఉంటారు? హోటల్లో తింటే ఆయన ఆరోగ్యం పాడవదా? మీ అమ్మగారికీ ఇక్కడ శ్రమ ఎక్కువవుతుంది. డెలివరీకి మూడు నెలల ముందు రమ్మని చెబుదాం. అంతవరకూ నీకేం సహాయం కావాలన్నా నన్నడుగు" అన్నాడు రాజేష్.

తన తల్లిదండ్రుల పట్ల అతని కన్సర్న్ చూసి ఆశ్చర్యపోయింది మానస.

అన్నట్టే మానసను చాలా బాగా చూసుకున్నాడు రాజేష్. డాక్టర్ దగ్గరకి చెకప్‌కు తీసుకెళ్ళడం, మందులూ పండ్లూ తెచ్చివ్వడం చేసేవాడు. పండ్లు కోసి ముక్కలు చేసి ఇవ్వడం, జ్యూస్ చేసి ఇవ్వడం వంటివి తనే చేసేవాడు. అతను మాటలతో ఎప్పుడూ చెప్పలేదు కానీ తనంటే అతనికి చాలా ఇష్టమని అతని చేష్టల ద్వారా ఈ కొద్దిరోజుల్లో అర్థమైంది ఆమెకి.

ఆ విషయం తల్లికి ఫోన్ చేసి చెప్పి ఆమెతో తన ఆనందం పంచుకుంది.

"కొంతమంది మగవాళ్ళు తరచూ భార్యతో తమ ప్రేమని వ్యక్తం చేస్తుంటారు. కొంతమంది సందర్భం వచ్చినప్పుడు తమ ప్రేమను వ్యక్తీకరిస్తారు. మరికొంత మంది తమ చర్యల ద్వారానే తమ ప్రేమ తెలుపుతారు. అది గుర్తించే మనసు భార్యలకుండాలి" అంది ఆమె తల్లి సుమతి.

ఓరోజు బయటికి వెళ్దామని రాజేష్ అంటే మానస ఉత్సాహంగా బయలుదేరింది. ఓ పేరున్న కంపెనీ కడుతున్న అపార్ట్‌మెంట్ దగ్గరికి తీసుకెళ్ళి మోడల్ హౌస్ చూపించి, ఆమెకి నచ్చితే కొందామని చెప్పాడు. కొద్దిరోజులు ఆలోచించి, కొందామని ఇద్దరూ నిర్ణయించుకుని, వెళ్ళి అడ్వాన్స్ కట్టారు. ఆ ఇంటిని తన పేరుమీదే కొంటున్నాడని తెలిసి వారించబోతే రాజేష్ వినలేదు.


మరుసటిరోజు "మిమ్మల్ని ఓ మాట అడుగుతాను. నిజాయతీగా జవాబు చెప్పాలి" అంది మానస రాజేష్‌తో.

"అడుగు" ఆశ్చర్యంగా ఆమె వైపు చూస్తూ అన్నాడు.

"నేను మీకు భార్యగా తగినదానినని మీరు భావిస్తున్నారా?"

"నాకు ఇంతవరకూ అటువంటి ఆలోచనే రాలేదు. నాకు వివాహ వ్యవస్థ మీద గౌరవముంది. ఒకసారి పెళ్ళి అంటూ జరిగాక ఎదుటి మనిషిలోని లోపాల్ని వెతకకూడదు. రోజురోజుకూ ప్రేమను పెంచుకుంటూ పోవాలి. లోపాల్ని వెతుక్కుంటూ పోతే ఇప్పుడు నువ్వడిగిన ప్రశ్న రోజూ మనసులో మెదుల్తూనే ఉంటుంది. మెల్లగా అసంతృప్తికి బీజం పడుతుంది. అప్పుడు ఎదుటివాళ్ళలో అన్నీ లోపాలే కనిపిస్తాయి."

చెంపపై ఛెళ్ళున కొట్టినట్లు ఫీలయింది మానస. ఆమె మనసు పశ్చాత్తాపంతో నిండిపోయింది. అప్పట్నుంచీ ఆమె



రాజేష్‌లో లోపాల్ని వెతకడం మానేసింది.

కొన్నాళ్ళకు మానసకు బాబు పుట్టాడు. మానస బాబు ఆలనా పాలనలో పడిపోయింది. మెటర్నిటీ లీవు అయ్యాక కూడా ఇంట్లో నుంచి పని చేయడానికి కంపెనీ అనుమతించడంతో బాబును చూసుకోవడం సులువయింది.

★ ★ ★

ఓ ఆదివారం మానస స్నేహితురాలు సౌజన్య మానస ఇంటికి వచ్చింది. మాటల్లో "విశాల్ ఈమధ్య బాగా మారిపోయాడు మనూ. ఇంట్లో ఒక్క పనీ ముట్టుకోవడం లేదు. ఇంట్లో ఉన్నంతసేపూ టీవీ చూడటం లేదా సెల్ చూడటం. బిడ్డ ఏడుస్తున్నా, కిందపడిపోతున్నా పట్టించుకోడు. ఉద్యోగం చేస్తూ ఇంట్లో అన్ని పనులూ చేసుకోవడం నావల్ల కావడం లేదు. ఉద్యోగం వదిలేయడం అంత సులువు కాదు. అంత జీతం ఎలా వదులుకోను? వదిలేస్తే మళ్ళీ ప్రతి అవసరానికీ అతన్ని అడుక్కుంటూ ఉండాలి" అంటూ భర్త గురించి చెప్పి కళ్ళనీళ్ళు పెట్టుకుంది సౌజన్య.

స్నేహితురాలి పరిస్థితి చూసి జాలిపడింది మానస. ఆ పరిస్థితి తనకు లేనందుకు సంతోషించింది. సౌజన్యకు ధైర్యం చెప్పి ఓదార్చింది.

ఆరోజు రాత్రి భోజనాలయ్యాక సౌజన్య తన ఇంటికి బయలుదేరుతూ "మనూ, నువ్వు చాలా అదృష్టవంతురాలివి. రాజేష్ నిన్ను ఎంత బాగా చూసుకుంటున్నాడో ఈ ఒక్క రోజులోనే నాకు అర్థమైంది. ఎన్ని పనులు చేస్తున్నాడు! ముఖ్యంగా చిన్నపిల్లల పనులంటే కొంతమంది మగవాళ్ళు విసుక్కుంటారు. రాజేష్ ఓపికగా బాబు పనులన్నీ కూడా చేస్తున్నాడు. నాకు చాలా సంతోషంగా ఉంది" అంది. అవునన్నట్టు తలూపింది మానస.

బాబుకు రెండేళ్ళు దాటాయి.

"వాణ్ణి ఎంతసేపూ ఇంట్లోనే ఉంచుకుంటే వాడికి బయటి ప్రపంచం ఎలా తెలుస్తుంది. మనం ఎక్కడికైనా వెళ్దాం" అంది మానస రాజేష్‌తో ఓ రోజు. రాజేష్ వెంటనే ఒప్పుకున్నాడు. అప్పట్నుంచీ ఆరు నెలలకోసారి టూర్లకు వెళ్ళసాగారు.

★ ★ ★

కొన్ని నెలల తర్వాత కొత్త ఇంట్లోకి గృహప్రవేశం చేశారు మానస-రాజేష్‌లు.

"నేను నలభై అయిదేళ్ళప్పుడు ఇల్లు కట్టాను. నువ్వు ముప్పై ఏళ్ళకే ఇంటి ఓనరువయ్యావు. నాకు చాలా సంతోషంగా ఉంది" అన్నాడు మానస తండ్రి భాస్కర్.

"మీకు ఉమ్మడి కుటుంబ బాధ్యతలు ఉండేవి కదా నాన్నా. మాకు బాధ్యతలు ఇరువైపులా లేవు. అందుకే కొనగలిగాం" అంది మానస.

"సిటీలో మీకు తగ్గ ఖర్చులు మీకు ఉంటాయి కదా. అయినా ఇది అల్లుడి గొప్పతనం. ఆర్థిక సంబంధమైన విషయాల్లో చక్కటి ప్లానింగ్ ఉంది అతనికి" అన్నాడు భాస్కర్.

తండ్రి తన భర్త గురించి గొప్పగా చెబుతుంటే మానసకు గర్వంగా అనిపించింది.

గృహప్రవేశానికి ఆనంద్ తన భార్యతో వచ్చాడు. ఫంక్షన్ అయ్యాక అందరూ కలసి మాట్లాడుకుంటూంటే ఆనంద్ "మానసా, బాబు పుట్టాడు, ఇల్లు కొన్నావు. ఇక నీ కెరీర్‌పైన దృష్టి పెట్టు" అన్నాడు మానసతో.

"తను ఇప్పుడు మేనేజర్ అండీ. చాలామందికి తను బాస్. ఇంటి పనీ బాబు పనీ చేసుకుంటూనే ఆఫీసు పని కూడా సమర్థంగా చేస్తోందంటే ఆలోచించండి తనకు ఎంత టాలెంట్ ఉందో" అన్నాడు రాజేష్.

"మానస టాలెంట్ గురించి నాకు తెలియదా... షి ఈజ్ ఎ జెమ్ ఆఫ్ ఎ పర్సన్" అన్నాడు ఆనంద్.

తర్వాత మానస ఒంటరిగా కనిపించినప్పుడు "దట్సాల్ యువర్ ఆనర్" అన్నాడు ఆనంద్ నవ్వుతూ.

మానస కూడా అర్థమైనట్లు తల ఊపి నవ్వింది సంతోషంగా. ★



ప్చ్... ఒలింపిక్ పతకాల పట్టికలో భారత్ స్థానాన్ని చూసిన ప్రతిసారీ సగటు క్రీడాభిమాని స్పందన ఇది. కానీ వ్యాపారవేత్త పార్థ్ జిందాల్ ఇందుకు భిన్నంగా స్పందించాడు. భారత్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఓ శిక్షణ సంస్థని ప్రారంభించాడు. అతడి ఆలోచనల్లోంచి పుట్టిన ఆ సంస్థ 'ఇన్‌స్పైర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్'.



మన ఆట మెరుగవుతుందిక!





మన జనాభాకు తగ్గట్టు అంతర్జాతీయ క్రీడల పోటీల్లో మనకి పతకాలు దక్కడం లేదు. అందుకు క్రీడలకు తగిన ప్రోత్సాహం లేకపోవడం, మౌలిక సదుపాయాల కొరత... లాంటి కారణలెన్నో! టాప్(టార్గెట్ ఒలింపిక్ పోడియం) లాంటి పథకాలతో పరిస్థితిలో కొంత మార్పు వస్తోంది. అయినా అది తక్కువే. అనేక శిక్షణ సంస్థలూ ఉన్నప్పటికీ, అక్కడ సరైన సదుపాయాలు ఉండడంలేదు. క్రీడల విప్లవం రావాలంటే మన దగ్గరా అంతర్జాతీయ ప్రమాణాలు ఉండాలి. ఆ ప్రయత్నమే చేస్తోంది 'ఇన్‌స్పైర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్(ఐఐఎస్)'.

కర్ణాటకలోని బళ్లారి సమీపంలో నిర్మించిన ఐఐఎస్‌లో అత్యున్నత ప్రమాణాలతో క్రీడా శిక్షణ ఇస్తున్నారు. మనదేశానికి చెందిన 'జేఎస్‌డబ్ల్యూ గ్రూప్' ఈ సంస్థని 2018లో ప్రారంభించింది. ఆ సంస్థకు చెందిన పార్థ్ జిందాల్ మానసపుత్రిక ఈ కేంద్రం. ఈయన క్రీడాభిమాని. ఇండియన్ సాకర్ లీగ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ, కబడ్డీ లీగ్‌లో హరియాణా స్టీలర్స్ జట్లకు యజమాని, ఐపీఎల్-దిల్లీ క్యాపిటల్స్ సహ యాజమాని. ఈ కేంద్రం ఏర్పాటుకు 24 కార్పొరేట్ సంస్థలూ సీఎస్ఆర్ నిధుల్ని అందించాయి. ఇక్కడ శిక్షణ పూర్తిగా ఉచితం. అభినవ్ బింద్రా, మహేష్ భూపతి, సౌరవ్ గంగూలీ... ఈ కేంద్రానికి సలహాదారులు. అథ్లెటిక్స్, జూడో, రెజ్లింగ్, స్విమ్మింగ్, బాక్సింగ్ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు. దేశవ్యాప్తంగా జూనియర్ స్థాయి పోటీల్లో ప్రతిభావంతుల్ని గుర్తించి వారికి శిక్షణ ఇస్తున్నారు. 12-16 ఏళ్ల మధ్య వయసు క్రీడాకారుల్ని ఎంపికచేసి నాలుగేళ్లపాటు శిక్షణ ఇస్తారు. ప్రస్తుతం 250 మంది క్రీడాకారులు ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారు. ఈ కేంద్రంలో 40 మంది విదేశీ కోచ్‌లూ ఉన్నారు. అంతర్జాతీయ పోటీల్లో మన జాతీయ గీతం వినిపించేలా కొత్తతరంలో స్ఫూర్తినింపడమే లక్ష్యంగా ఇది పనిచేస్తోంది.



శిక్షకులతో... పార్థ్ జిందాల్

42 ఎకరాల్లో విస్తరించిన ఈ అకాడమీలో బౌద్ధారామం తరహాలో ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, ఖతార్, దక్షిణ ఆఫ్రికా... వంటి దేశాల్లో క్రీడా ప్రాంగణాల్ని సందర్శించాక దీన్ని డిజైన్ చేశారు. అత్యాధునిక జిమ్ పరికరాలు తెప్పించారు. ఇండోర్ సింథటిక్ రన్నింగ్ ట్రాక్; బాక్సర్లు, రెజ్లర్లు, జూడో ఆటగాళ్ల ప్రాక్టీసు కోసం షాక్ అబ్జార్బ్ ఫ్లోర్ హాల్... లాంటి ప్రత్యేకతలున్నాయి. ఇక్కడి 'స్పోర్ట్స్ మెడిసిన్' విభాగం దేశంలోనే అత్యుత్తమం. రెజ్లర్లు బజ్‌రంగ్ పునియా, గీతా ఫొగాట్, వినేష్ ఫొగాట్, సాక్షి మాలిక్ లాంటి వాళ్లు ఇక్కడికి శిక్షణకీ చికిత్సకూ వస్తుంటారు. చిన్నారి అథ్లెట్లకు శిక్షణ మాత్రమే కాదు, ప్లస్‌టూ వరకూ చదువుకునే వీలూ ఇక్కడ ఉంటుంది. అన్నం, చికెన్, థాయ్ గ్రీన్ కర్రీ, రోటీ, గుడ్డు... మొదలైన వాటితో ఆటగాళ్లకి అత్యుత్తమ డైట్ అందుతుంది.

మార్పు మొదలైంది...


21 ఏళ్ల ట్రిపుల్ జంపర్ ప్రవీణ్ చిత్రవేల్... నాలుగేళ్ల నుంచి ఐఐఎస్‌లోనే శిక్షణ తీసుకుంటున్నాడు. డైమండ్ లీగ్ లాంటి అంతర్జాతీయ వేడుకల్లో రాణిస్తున్నాడు. ఒలింపియన్ స్టీపుల్ ఛేజర్ అవినాష్ సాబ్లే, ఆసియా ఛాంపియన్‌షిప్‌లో రజతం గెలిచిన లాంగ్ జంప్ క్రీడాకారుడు శ్రీశంకర్ మురళీ ఇక్కడే శిక్షణ తీసుకుంటున్నారు. అంతర్జాతీయ ట్రిపుల్ జంపర్లు ఎల్డోస్ పాల్, అబ్దుల్ అబూబాకర్ల శిక్షణా ఇక్కడే. తేజశ్విన్ శంకర్... కామన్వెల్త్ క్రీడల్లో డెకథ్లాన్ కాంస్య పతక విజేత. అయిదేళ్లపాటు అమెరికాలో చదువుతూ శిక్షణ తీసుకునేవాడు. ఏప్రిల్‌లో ఇండియా తిరిగి వచ్చినప్పుడు తన శిక్షణకు ఐఐఎస్‌నే ఎంచుకున్నాడు. అంతర్జాతీయ స్థాయి భారతీయ ఆటగాళ్లకు ఇక్కడి వసతులు వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, బాక్సర్ నిఖత్ జరీన్... శిక్షణ కోసం ఇక్కడకి వస్తుంటారు. ఈ ఏడాది మార్చిలో 'ఇండియన్ ఓపెన్ - త్రోస్ అండ్ జంప్స్' పోటీలకూ ఆతిథ్యం ఇచ్చింది ఐఐఎస్. ఈ సంస్థ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో స్విమ్మింగ్, హరియాణాలోని హిసార్‌లో రెజ్లింగ్, హిమాచల్ ప్రదేశ్‌లో బాక్సింగ్, మణిపుర్‌లో జూడో శిక్షణ కేంద్రాల్నీ నిర్వహిస్తున్నారు.

ఐఐఎస్‌లో ప్రధాన భవనానికి ఉన్న గడియారం 2024 ప్యారిస్ ఒలింపిక్స్ కౌంట్‌డౌన్‌ని సూచిస్తూ... ఆటగాళ్ల లక్ష్యాన్ని నిరంతరం గుర్తుచేస్తుంది. ఈసారి ఒలింపిక్ విజేతల్లో ఐఐఎస్ ఆటగాళ్లూ ఉంటారని నమ్మకంగా చెబుతున్నారు పార్థ్. ★

హాయ్ బుజ్జీ


ప్రతిబింబం ఏది?

బంటీ భలేగా గిటార్ వాయిస్తున్నాడు కదూ! ఈ రంగు గడిలోని చిత్రానికి సంబంధించిన ప్రతిబింబం ఏదో గుర్తుపట్టగలరా?



దారి కనుక్కోండి

నవీన్ తన బుజ్జి కుక్కపిల్లను తీసుకుని బయటకు వచ్చాడు. కానీ అది పారిపోయింది. దాన్ని పట్టుకోవడంలో మీరు నవీన్‌కు ఏమైనా సాయం చేయగలరా?



కనిపెట్టగలరా!

పిల్లలంతా చక్కగా ఆడుకుంటున్నారు కదూ! ఈ బొమ్మలో 'D' అక్షరంతో ప్రారంభమయ్యేవి కొన్ని దాగున్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం?



భళా... తబలా బాల!



చిట్టి చేతులు అద్భుతాన్ని చేశాయి. లేత వేళ్లు చరిత్ర సృష్టించాయి! అసోంకు చెందిన పన్నెండేళ్ల శ్రీయా భట్టాచార్జీ తబలాను అలవోకగా వాయించగలదు. ఇటీవల ఏకధాటిగా 62 నిమిషాల 53 సెకన్లపాటు వాయించింది. అతిపిన్న వయసులో ఎక్కువ సమయం పాటు నిర్విరామంగా తబలా వాయించిన కేటగిరీలో రికార్డు సృష్టించి 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించింది. సింగపూర్‌లో జరిగిన తొమ్మిదో కల్చరల్ ఒలంపియాడ్‌లో పాల్గొని బంగారు పతకాన్నీ సొంతం చేసుకుంది. 'ఆల్ నార్త్ ఈస్ట్ తబలా సోలో' విభాగంలో విజేతగా నిలిచింది. 'ఆల్ ఇండియా పీటీ రూపక్ కులకర్ణి మ్యూజిక్ కాంపిటీషన్', 'ఆల్ ఇండియా తబలా సోలో కాంపిటీషన్'లో పాల్గొని తన సత్తా చాటింది. మరోవైపు చదువులోనూ రాణిస్తూ... మనలాంటి ఎంతోమంది చిన్నారులకు ఆదర్శంగా నిలిచింది.

తేడాలేంటి?

ఈ రెండు బొమ్మల మధ్యా ఎనిమిది తేడాలున్నాయి. అవేంటో చెప్పండి.



దాగుడు మూతలు!

పిల్లలంతా ఎంచక్కా ఆడుకుంటున్నారు కదూ! ఈ బొమ్మలో ఫ్లూట్, తాళంచెవి, సేఫ్టీ పిన్ను, కత్తెర, నత్త, సుత్తి, స్క్రూడ్రైవర్, చేప దాగి ఉన్నాయి. మీరు వాటిని కనిపెట్టగలరా?



నిజం... అబద్ధం!

ఒక రోజు అక్బర్ చక్రవర్తి సభలో కొలువుదీరి ఉన్నాడు. హఠాత్తుగా ఆయనకు ఓ అనుమానం వచ్చింది. సభనంతా ఒకసారి పరికించి చూశాడు. ఆ చూపు వెనక అర్థం తెలియక సభలోని వారందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. 'నిజానికీ అబద్ధానికీ మధ్య గల తేడాను కేవలం రెండు మూడు పదాల్లో మీలో ఎవరైనా చెప్పగలరా?' అని అక్బర్ ప్రశ్నించాడు. ఏం సమాధానం చెబితే... ఏం ఇబ్బంది వస్తుందో అని.. సభలోని వారెవ్వరూ జవాబివ్వడానికి ముందుకు రాలేదు. ఇదే ప్రశ్నను అక్బర్ మరోసారి అడిగాడు. ఈసారీ అందరూ మౌనంగా ఉండిపోయారు. అక్బర్ చూపు బీర్బల్‌పై పడింది. 'నేను అడిగిన ప్రశ్నకు సమాధానం నువ్వు చెప్పు' అన్నాడు అక్బర్. 'చిత్తం జహాపనా! నిజానికీ అబద్ధానికీ మధ్య అరచేయంత తేడా ఉంది' అని చెప్పాడు బీర్బల్. అక్బర్‌తోపాటు సభలోని వారెవ్వరికీ ఇందులోని అంతరార్థం అర్థం కాలేదు. వెంటనే అక్బర్... 'బీర్బల్, నీ సమాధానాన్ని ఇంకాస్త వివరంగా చెప్పగలవా?' అని అడిగాడు. 'తప్పకుండా.. మహారాజా! కళ్లకూ చెవులకూ మధ్య దూరం దాదాపు అరచేయంత ఉంటుంది. ఎవరో చెబితే చెవితో విన్న మాటలు అసత్యమైతే, మనం స్వయంగా కంటి ద్వారా చూసేవి సత్యం అవుతాయి' అంటూ చెప్పాడు బీర్బల్. ఈ సమాధానంతో ముగ్ధుడైన అక్బర్ బీర్బల్‌కు ముత్యాలహారాన్ని బహుమతిగా ఇచ్చి సత్కరించాడు.



పోలికలేంటి?

ఈ బొమ్మల్లో అద్దం, నిలువు, ఐమూలగా ఉన్నవాటికి కొన్ని పోలికలున్నాయి. అవేంటో చెప్పగలరా?



రంగులేద్దాం



జవాబులు

తేడాలేంటి?: 1. కొండ 2. పక్షి 3. కుందేలు చెవి 4. పక్షి నివాసం కింది కర్ర 5. అమ్మాయి చెవిలో పువ్వు 6. చెట్టు 7. అమ్మాయి లంగా అంచు 8. అమ్మాయి చొక్కా.

ప్రతిబింబం ఏది?: 2

కనిపెట్టగలరా?: 1. Dog 2. Dragon fruit 3. Dice 4. Dolphin 5. Door 6. Dumbells 7. Dinosaur 8. Drone.

పోలికలేంటి?: అడ్డం: అద్దం, మెట్లు, ఫ్రిజ్; నిలువు: స్కూల్‌బ్యాగ్, నీళ్లసీసా, సోఫా; ఐమూలగా: స్విచ్ బోర్డు, ఎరుపురంగు చొక్కా.

దాగుడు మూతలు: 1. ట్రాలీ హ్యాండిల్ బదులుగా ఫ్లూట్ 2. అబ్బాయి చొక్కా మీద తాళం చెవి 3. ఇంటి కప్పు మీద సేఫ్టీ పిన్ను 4. గడ్డిలో కత్తెర 5. అమ్మాయి చొక్కా మీద నత్త 6. చెట్టుపైన సుత్తి 7. ఇటుకల మీద స్క్రూ డ్రైవర్ 8. పొదలో చేప.

వరలక్ష్మికి... ఆరగింపు!



వరాలనొసగే వరలక్ష్మిని భక్తిశ్రద్ధలతో కొలిచే పండుగే వరలక్ష్మీ వ్రతం. ఈ రోజున అమ్మవారిని అంగరంగవైభవంగా అలంకరించడం ఒకెత్తయితే... దేవికి నివేదించే ప్రసాదాలు మరొకెత్తు. మరి ఈసారి ఎలాంటి వంటకాలను చేయాలనుకుంటున్నారూ...





పెసరవడలు

కావలసినవి: పెసలు: కప్పు, సెనగపప్పు: అరకప్పు, అల్లం: చిన్న ముక్క, దనియాలు: అరచెంచా, మిరియాలు: అరచెంచా, జీలకర్ర: చెంచా, పచ్చిమిర్చి: మూడు, వాము: అర చెంచా, కొత్తిమీర తరుగు: పావుకప్పు, ఉప్పు: తగినంత, నూనె: వేయించేందుకు సరిపడా.

తయారీ విధానం: పెసలు, సెనగపప్పును కలిపి అయిదారుగంటల సేపు నానబెట్టుకోవాలి. ఆ తరువాత నీటిని పూర్తిగా వంపేసి ఈ పప్పుల్ని మిక్సీలో వేసుకుని తగినంత ఉప్పు వేసి... బరకగా, గట్టిగా రుబ్బుకుని ఓ గిన్నె లోకి తీసుకోవాలి. ఇప్పుడు స్టవ్‌మీద కడాయిని పెట్టి.. దనియాలు, మిరియాలు, జీలకర్ర, వాము వేసి దోరగా వేయించుకుని మిక్సీలో వేయాలి. ఇందులో అల్లం, కొత్తిమీర, పచ్చి మిర్చి కూడా వేసి మెత్తగా చేసుకుని... ఈ మిశ్రమాన్ని రుబ్బిన పప్పులో కలపాలి. ఈ పిండిని ప్లాస్టిక్ కవరు మీద వడల్లా అద్దుకుంటూ కాగుతున్న నూనెలో వేస్తూ ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి.

కొబ్బరిపాయసం

కావలసినవి: కొబ్బరికాయ: ఒకటి, బియ్యం: చెంచా (అరగంట సేపు నానబెట్టుకోవాలి), పాలు: లీటరు, చక్కెర: ఒకటిన్నర కప్పు, యాలకులపొడి: చెంచా, కిస్‌మిస్ - జీడిపప్పు - బాదం- పిస్తా పలుకులు: అన్నీ కలిపి అరకప్పు, నెయ్యి: పావుకప్పు, ఎండుకొబ్బరి ముక్కలు: పావుకప్పు.

తయారీ విధానం: ముందుగా కొబ్బరికాయను తురుముకుని... నానబెట్టిన బియ్యంతో కలిపి మిక్సీలో తీసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. స్టవ్‌మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోయాలి. అవి మరుగుతున్నప్పుడు చేసిపెట్టుకున్న కొబ్బరి మిశ్రమాన్ని వేసి ఓసారి కలిపి స్టవ్‌ని సిమ్‌లో పెట్టాలి. పాలు బాగా మరుగుతున్నప్పుడు చక్కెర, యాలకులపొడి వేయాలి. చక్కెర కరిగి, పాయసం చిక్కగా అవుతున్నప్పుడు దింపేయాలి. ఇప్పుడు స్టవ్‌మీద కడాయిని పెట్టి... నెయ్యి వేసి డ్రైఫ్రూట్స్ పలుకులూ, కొబ్బరి ముక్కలూ వేయించుకుని పాయసంలో వేసి కలిపితే చాలు.

పులిహోర

కావలసినవి: బియ్యం: కప్పు, నువ్వుల నూనె: రెండు చెంచాలు, ఎండుమిర్చి: నాలుగు, దనియాలు: చెంచా, సెనగపప్పు: రెండు చెంచాలు, మినప్పప్పు: రెండు చెంచాలు, ఆవాలు: అరచెంచా, మిరియాలు: చెంచా, మెంతులు: పావుచెంచా, ఎండుకొబ్బరి పొడి: అరకప్పు.

తాలింపుకోసం: నువ్వులనూనె: పావుకప్పు, ఆవాలు: చెంచా, జీలకర్ర: చెంచా, మినప్పప్పు: చెంచా, సెనగపప్పు: చెంచా, పల్లీలు: పావుకప్పు, ఇంగువ: పావుచెంచా, ఎండుమిర్చి: రెండు, పచ్చిమిర్చి: మూడు, కరివేపాకు రెబ్బలు: రెండు, చింతపండు: నిమ్మకాయ సైజులో (నానబెట్టుకోవాలి), పసుపు: అరచెంచా, బెల్లం తరుగు: చెంచా, ఉప్పు: తగినంత.

తయారీ విధానం: బియ్యాన్ని కడిగి కుక్కర్‌లో తీసుకుని రెండు కప్పుల నీళ్లు పోసి, చెంచా నూనె వేసి స్టవ్‌మీద పెట్టి... మూడు కూతలు వచ్చాక స్టవ్‌ని కట్టేయాలి. ఇలా వండిన అన్నాన్ని ఓ పళ్లెంలో వేసి ఆరబెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్‌మీద కడాయిని పెట్టి మరో చెంచా నూనె వేసి ఎండుమిర్చి, దనియాలు, సెనగపప్పు, మినప్పప్పు, ఆవాలు, మిరియాలు, మెంతులు వేయించుకుని తీసుకోవాలి. అదే కడాయిలో కొబ్బరిపొడిని కూడా వేసుకుని ఓ నిమిషం వేయించుకుని తీసుకోవాలి. ఇలా వేయించుకున్న పదార్థాలన్నింటినీ మిక్సీలో తీసుకుని మెత్తగా పొడి చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్‌మీద మళ్లీ కడాయిని పెట్టి నూనె వేయాలి. అది వేడెక్కాక ఆవాలు, జీలకర్ర, మినప్పప్పు, సెనగపప్పు, ఇంగువ, ఎండుమిర్చి, పల్లీలు వేయించుకుని పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు వేయాలి. తరువాత ఇందులో చింతపండు గుజ్జు, పసుపు, తగినంత ఉప్పు, బెల్లం, చేసిపెట్టుకున్న పొడిని మూడు చెంచాలు వేసి కలపాలి. చింతపండు గుజ్జు ఉడికి బాగా చిక్కగా అయ్యాక దింపేయాలి. ఈ మిశ్రమాన్ని అన్నంపైన వేసి కలిపితే చాలు. కమ్మని పులిహోర సిద్ధం.

గోధుమరవ్వ లడ్డు

కావలసినవి: గోధుమరవ్వ: ఒకటిన్నర కప్పు, వేడినీళ్లు: నాలుగు కప్పులు, నెయ్యి: అరకప్పు, చక్కెర: ఒకటిన్నర కప్పు, ఆరెంజ్‌ఫుడ్‌కలర్: అరచెంచా, యాలకులపొడి: చెంచా, జీడిపప్పు పలుకులు: రెండు టేబుల్‌స్పూన్లు, పిస్తా పలుకులు: రెండు టేబుల్‌స్పూన్లు, తర్బూజా గింజలు: రెండు టేబుల్‌స్పూన్లు.



తయారీ విధానం: స్టవ్‌మీద కడాయిని పెట్టి నెయ్యి వేయాలి. అది వేడెక్కాక గోధుమరవ్వను వేసి వేయించుకోవాలి. రవ్వ కాస్త రంగు మారుతున్నప్పుడు వేడినీళ్లు పోసి... సగం ఆరెంజ్‌ఫుడ్‌కలర్‌ను వేసి బాగా కలపాలి. రవ్వ పూర్తిగా ఉడికిందనుకున్నాక చక్కెర, మిగిలిన ఫుడ్‌కలర్‌ను వేసి మరోసారి కలిపి స్టవ్‌ని సిమ్‌లో పెట్టాలి. చక్కెర కరిగి ఈ మిశ్రమం దగ్గరకు అయ్యాక యాలకులపొడి, జీడిపప్పు, పిస్తా పలుకులు, తర్బూజా గింజల్ని వేసి కలిపి దింపేయాలి. ఈ మిశ్రమం వేడి చల్లారాక చేతిని తడి చేసుకుంటూ లడ్డూల్లా చుట్టుకోవాలి.

రాశి ఫలం

గ్రహబలం
(ఆగస్టు 20 - 26)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం
అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

కాలం అనుకూలం. ఉత్సాహంగా ముందుకు సాగండి. నిర్ణయం తీసుకున్నాక ఇక దాని గురించి ఆలోచించవద్దు. ఉద్యోగంలో స్వల్ప విఘ్నాలున్నా కార్యసిద్ధి ఉంటుంది. ముఖ్యమైన విషయాల్లో స్పష్టత అవసరం. సద్భావన విశేష లాభాన్నిస్తుంది. వ్యాపారంలో శ్రద్ధ పెట్టాలి. రుణసమస్యలు తగ్గుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి. ఇష్టదేవతాస్మరణ శక్తినిస్తుంది.



వృషభం
కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

వ్యాపార లాభాలున్నాయి. పరిస్థితులకు తగిన నిర్ణయాలు తీసుకుని అమలుచేయండి. ఉద్యోగంలో అజాగ్రత్త పనికిరాదు. సూర్యదోషం గోచరిస్తోంది. ఒత్తిడి కలగకుండా చూసుకోవాలి. మొహమాటం వల్ల శ్రమ పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో చర్చించి నిర్ణయాలు తీసుకోండి. సమయస్ఫూర్తితో సత్ఫలితాలు సాధిస్తారు. సూర్యారాధన మేలుచేస్తుంది.



మిథునం
మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఉద్యోగంలో శుభఫలితాలున్నాయి. అనుకున్న స్థాయికి చేరతారు. అనుకూలమైన కాలం. విజ్ఞానపరంగా అభివృద్ధి చెందాలి. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. మంచి నిర్ణయాలతో నలుగురికీ ఆదర్శంగా నిలుస్తారు. పొరపాట్లు జరగనివ్వద్దు, ధర్మాన్ని వీడవద్దు. మిత్రుల అండ లభిస్తుంది. విష్ణుసహస్రనామ స్మరణ శుభప్రదం.



కర్కాటకం
పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

వ్యాపారంలో అభివృద్ధిని సాధిస్తారు. నూతన ప్రయత్నాలు సఫలమవుతాయి. ధనలాభముంది. పేరుప్రతిష్ఠలు పెరుగుతాయి. బాధ్యతలను సకాలంలో నిర్వర్తించండి. ఉద్యోగంలో మేలు జరుగుతుంది. గందరగోళ స్థితి తొలగుతుంది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. శత్రుదోషం తొలగుతుంది. ఇంట్లో శుభాలు జరుగుతాయి. ఇష్టదేవతను స్మరించండి, శుభవార్త వింటారు.



సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

పరిస్థితులను అర్థం చేసుకుంటూ ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలి. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. గ్రహదోషం వల్ల విఘ్నాలు ఉంటాయి. ఉద్యోగంలో ఒత్తిడి పెరుగుతుంది. మొహమాటం పక్కన పెట్టి పనిచేయండి. వ్యాపారంలో జాగ్రత్త. పనులు వాయిదా వేయవద్దు. నవగ్రహ దేవతలను స్మరించండి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.



కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

ముఖ్యకార్యాల్లో అప్రమత్తంగా ఉండాలి. మనోబలంతో ఆటంకాలను అధిగమించాలి. ప్రతి విషయాన్నీ ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. ఈర్ష్యతో నిందారోపణలు చేసేవారున్నారు, శాంతంగా ఉండాలి. మీ ధర్మం మిమ్మల్ని కాపాడుతుంది. ఏకాదశంలో శుక్రుడివల్ల ధనయోగముంది. ఇష్టదేవతను స్మరించండి, మంచి జరుగుతుంది.



తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగంలో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. ఆర్థికంగా బలపడతారు. మీవల్ల కొందరికి మేలు జరుగుతుంది. వ్యాపారంలో ధనలాభం సూచితం. తొందర నిర్ణయాల వల్ల ఖర్చులు పెరగకుండా జాగ్రత్తపడాలి. ద్వాదశంలో కుజుడి వల్ల రుణసమస్యలు పెరగవచ్చు. ఆవేశపరిచే సన్నివేశాలకు దూరంగా ఉండాలి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించండి, శుభం జరుగుతుంది.



వృశ్చికం
విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

అనుకూలమైన కాలం. ఎటుచూసినా శుభమే గోచరిస్తోంది. ఆశించిన ఫలితాలు వస్తాయి. ఉద్యోగంలో స్థిరత్వం ఏర్పడుతుంది. ప్రతిభతో పెద్దల్ని మెప్పిస్తారు. కొన్ని సమస్యలు పరిష్కారమవుతాయి. భూ గృహ వాహనాది యోగాలు అనుకూలిస్తాయి. అవకాశాలను సద్వినియోగం చేసుకోండి. వ్యాపారంలో ఇతరులపై ఆధారపడవద్దు. లక్ష్మీదేవిని దర్శిస్తే మంచిది.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

కాలం సహకరిస్తోంది. ప్రయత్నలోపం లేకుండా కృషిచేసి మంచి ఫలితాలు పొందండి. అధికార యోగం సూచితం. ధైర్యంగా నిర్ణయాలు తీసుకుని అమలు చేయండి. పని ప్రారంభించాక నిర్ణయాలను మార్చకూడదు. ఆర్థికంగా బలపడతారు. వ్యాపారంలో ఇబ్బంది పెట్టేవారుంటారు. సూర్య నారాయణుడి దర్శనం శుభప్రదం.



మకరం
ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొత్త పనులు ప్రారంభించవద్దు. ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలి. బాధ్యతల్ని సకాలంలో పూర్తిచేయాలి. ధైర్యం రక్షిస్తుంది. ఆటంకాలు కలిగించే వారుంటారు. ఎవరినీ నమ్మి డబ్బు ఇవ్వవద్దు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పనిచేయాలి. వ్యాపారం బాగుంటుంది. సమష్టి నిర్ణయాలు మేలు చేస్తాయి. నవగ్రహ శ్లోకాలు చదువుకోండి, అనుకున్నది సాధిస్తారు.



కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

సకాలంలో పని మొదలుపెట్టండి. విఘ్నాలు ఉన్నాయి. ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి, తర్వాత వెనకడుగు వేయవద్దు. లక్ష్యం చేరేవరకూ కృషి కొనసాగించాలి. సంయమనం అవసరం. చంచల నిర్ణయాల వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. పనులను మధ్యలో ఆపవద్దు. తగిన విశ్రాంతి తీసుకోండి. నవగ్రహ శ్లోకాలు చదువుకోండి, విజయం లభిస్తుంది.



మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఎటుచూసినా శుభమే గోచరిస్తోంది. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ అదృష్టయోగాన్ని అందిపుచ్చుకోవాలి. వృత్తి ఉద్యోగ వ్యాపారాల్లో కలిసివస్తుంది. అధికార యోగం సూచితం. పెద్దలు ప్రసన్నులవుతారు. వ్యాపారంలో లాభాలున్నాయి. ఇప్పుడు చేసే పనులు బంగారు భవిష్యత్తునిస్తాయి. ఇంట్లో శుభాలు జరుగుతాయి. లక్ష్మీదేవిని స్మరించండి, ప్రశాంతమైన జీవితం లభిస్తుంది.

పదవినోదం

కూర్పు: బాలు

1		2	*	3	*	4	5		6	*	7
	*	8	9		10	*		*	11	12	*
13	14	*		*	15	16	*	17	*	18	
*	19	20	*	21					22		*
23					*		*	24		*	25
	*		*	26	27	*	28		*	29	
30	31	*	32	*	33	34		*	35		*
*	36		*	37	*		*	38		*	39
40		*	41		42	*	43	*	44	45	
	*	46	*	47				48	*		*
*	49		50	*		*	51		52	*	53
54	*	55			*	56		*	57		

ఆధారాలు

అడ్డం:

1. అర్జునుడి ధనుస్సు (3)
4. తన్మయత్వం (4)
7. నిలువు రెండుతో అభివాదం (1)
8. చిరునవ్వు (4)
11. చేవ, సత్తా (2)
13. మూడు చక్రాల వాహనం (2)
15. అల సమానార్థకం చివర మాయమైంది (2)
18. విఖ్యాతి, ఘనత, కీర్తి (2)
19. తడబడిన 'వేళ' (2)
21. నలుడు-దమయంతి... కలిసి? (7)
23. దీన్ని కోస్తే రత్నమాణిక్యాల్లాంటి తొనలు (5)
24. సమయం (2)
26. శివుడి వృషభం (2)
28. నాగలి (2)
29. శిలను అందంగా చెక్కితే..? (2)
30. సేవ, పని (2)
32. అడ్డం 26తో కూతురు (1)
33. ప్రళయం (3)
35. శాపానికి వ్యతిరేకం (2)
36. మోసం (2)
38. ధూమం (2)
40. స్నానం (2)
41. వెతుకులాట, అన్వేషణ (3)
44. అప్పు సమానార్థకం మధ్యలో అక్షరం చేరితే కాంతి! (3)
47. తెనాలి రామకృష్ణుణ్ని ఇలాగంటారు! (5)
49. మగువ (3)
51. రచ్చ (3)
54. అడ్డం 32తో సత్యం (1)
55. భర్త (3)
56. జీవం (2)
57. భిక్షం (3)

నిలువు:

1. శకుని సోదరి! (3)
2. నూరు (2)
3. మిక్కిలి, గొప్ప, పెద్ద (2)
5. రథమెక్కి యుద్ధం చేసేవాడు (2)
6. మెరుపు (2)
9. తేరు (2)
10. శృంఖలం, బేడీ (3)
12. ప్రశ్న (3)
14. కడగడం, శుద్ధి చేయడం (3)
16. పన్ను, దంతం (3)
17. సాయంత్రం (4)
20. ఎండాకాలం (3)
21. నేత్రం (3)
22. పది గ్రాముల బంగారం (2)
23. తెర (3)
25. దూది పరుపు (2)
27. స్వర్గం (2)
28. గుర్రం (2)
29. తల (2)
31. నిలువు తొమ్మిదిలోనిదే వేరేలాగా (3)
34. లాభం, మేలు (2)
35. మామిడిపిండె రుచి..? (3)
37. లక్ష్మి (3)
39. శరం (2)
40. రాగి (2)
42. డూప్లికేటు (3)
43. కరణం గాని కరణం (4)
45. పోగు, కుప్ప, రాశి (2)
46. బొమ్మ (3)
48. రెండో తెలుగు సంవత్సరాన్ని గుర్తుచేసే తేజస్సు, కాంతి (2)
50. దుఃఖం, బాధ (2)
52. భార్య, పార్వతి (2)
53. ఆగ్రహం (2)

సుడోకు

			7	1				5
	7	5					2	8
	4	9	6	5				
8		3	2			5		6
			3		6			
7		6			4	3		1
				2	7	9	6	
3	1					7	5	
9				3	5			

గతవారం సమాధానాలు

పదవినోదం

1 ఉం	*	2 మా	3 న	సం	*	4 జ్ఞా	నం	*	5 మా	*	6 వా
7 గ	డి	యా	రం	*	8 చెం	ప	*	9 ఓ	టి	మి	*
రం	*	వి	*	10 ప	*	11 కం	12 ద	ర్పు	డు	*	13 ఊ
*	14 లం	*	15 మె	ల్ల	గా	*	ర్ప	*	16 గు	17 లా	బి
18 క	*	19 ప	రు	వం	*	20 కం	కు	లు	*	లి	*
*	21 గె	లు	పు	*	22 న	దు	లు	*	23 అ	పా	యం
24 ద్రి	*	వృ	*	25 క్రూ	రు	డు	*	26 ము	చ్చ	ట	*
27 అ	28 మ	రు	29 లు	*	డు	*	30 శ్యా	*	ర	*	31 మం
*	న	*	32 కా	33 మి	*	34 ప్ర	స	35 వం	*	36 అ	ది
37 మో	వి	38 సై	*	39 త్రు	టి	లో	*	40 పు	41 ర	స్కా	రం
తా	*	42 రు	43 ద్రు	డు	*	44 భా	ర్య	*	45 వా	రం	*
46 దు	వ్య	*	మం	*	47 సా	లు	*	48 దా	ణా	*	49 వి

సుడోకు

2	5	4	8	7	9	6	3	1
6	1	8	2	3	5	7	9	4
3	9	7	6	4	1	2	5	8
8	7	5	3	6	4	1	2	9
4	6	9	1	2	8	5	7	3
1	2	3	9	5	7	4	8	6
7	4	1	5	9	3	8	6	2
5	3	6	4	8	2	9	1	7
9	8	2	7	1	6	3	4	5





చైనాలో 'వెనిస్'!












పెద్దవాళ్లకైనా, పిల్లలకైనా నీళ్లని చూస్తే చాలు, అమాంతం దిగిపోయి... హాయిగా ఆడి పాడాలనిపిస్తుంది. అయితే కాలుష్యం పుణ్యమా అని ఇప్పుడు నదులూ, సరస్సుల పరిస్థితి అలా లేదు కదా! తమ పర్యటకులకు ఆ ఇబ్బంది ఉండకూడదనుకుంది... చైనాలోని గ్వాంగ్‌డాంగ్ రాష్ట్రం, ఇంగ్డే ప్రాంతంలోని ఓ రిసార్ట్ యాజమాన్యం. అందుకోసం అబ్బుర పరిచే ఈత కొలనును నిర్మించింది. కొలనంటే అన్నింటి లాంటిది కాదు, నది లాంటిదీ కాలువ లాంటిదీనూ. ఈ రిసార్ట్‌లోని మొత్తం 300 విల్లాలనీ కలుపుతూ 1.3కి.మీ పొడవు ఉంటుంది. ప్రతి విల్లాలో ఈతకూ, ఆటలకూ అవసరమైన సామగ్రి ఉంటుంది. అంతే కాదు, అక్కణ్నుంచి రెస్టరెంట్ వరకూ వెళ్లడానికి పుట్టీల్లాంటివీ ఉంటాయి. అందుకే ఈ రిసార్ట్‌కు వెళ్లే వాళ్లంతా 'ఏమి హాయిలే... హలా' అంటూ గదిలోకంటే ఎక్కువ సమయం ఈ కృత్రిమ నదిలోనే కాలక్షేపం చేస్తుంటారు!



An ISO 9001 - 2000 Certified ®

Dr. CARE
HOMEOPATHY
Health • Healing • Happiness

థైరాయిడ్, దాని సంబంధిత వ్యాధులకు మూలాల నుండి చికిత్స



అడ్వాన్స్‌డ్ కాన్‌స్టిట్యూషనల్ సిమిలిమమ్ పద్ధతి ద్వారా, ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని అత్యుత్తమ చికిత్స

- నెలసరి సమస్యలు
- నీరసం
- బరువు పెరగటం / తగ్గడం
- ఏకాగ్రత కోల్పోవడం
- సంతానలేమి
- రక్తహీనత
- జుట్టు ఊడిపోవడం
- అలసట
- నరాల బలహీనత

డాక్టర్ గారితో మాట్లాడాలనుకొంటున్నారా? కాల్ చేయండి : **767 200 2000**

ఇతర ప్రత్యేక చికిత్సలు

డయాబెటిస్



- అతి మూత్ర విసర్జన
- అతిగా ఆకలి, దాహము
- బరువు తగ్గడం
- అలసట
- అరికాళ్ళలో తిమ్మిరులు, మంటలు
- గాయాలు తొందరగా మానకపోవటం

శ్వాస సమస్యలు




- ఆస్తమా, అలర్జీ
- దగ్గు
- అడినాయిడ్స్
- టాన్సిల్స్
- నిమోనియా
- సైనసైటిస్
- బ్రాంకైటీస్
- ఫారింజైటిస్
- లారెంజైటిస్

కీళ్ళ నొప్పులు



- కీళ్ళ వాపులు, బిరుసుదనం
- ఆస్టియో ఆర్థరైటిస్
- జాయింట్లలో నొప్పి
- గౌట్, రుమాటాయిడ్ ఆర్థరైటిస్
- కీళ్ళలో పట్టులేకపోవడం

లివర్ సమస్యలు



- హెపటైటిస్ బి, సి, డి, ఇ
- ఫ్యాటీ లివర్
- GERD
- లివర్ సిర్రోసిస్
- ఆల్సర్ అల్సర్
- క్రానిక్ గ్యాస్ట్రైటిస్

చర్మ సమస్యలు



- సోరియాసిస్
- ఎగ్జిమా
- బొల్లి
- SLE
- దద్దుర్లు
- ఫంగల్ ఇన్‌ఫెక్షన్
- మొటిమలు
- అర్టికెరియా
- లైకెన్ ప్లేనస్

మలబద్ధకం



- కడుపు నొప్పి
- వాంతి లక్షణాలు
- ఆయాసము
- వాత రోగాలు
- నడుం నొప్పి
- దినచర్య లోపాలు

ప్రొస్టేట్ సమస్యలు



- ప్రొస్టేట్ గ్రంధి వాపు
- మూత్రంలో రక్తం
- మూత్ర విసర్జనలో ఇబ్బంది
- పొత్తి కడుపులో నొప్పి
- ప్రొస్టేట్ క్యాన్సర్
- BPH

మానసిక సమస్యలు



- నిద్రలేమి (Insomnia)
- ఆత్రుత (Anxiety)
- మానసిక ఒత్తిడి
- OCD
- డిప్రెషన్ (Depression)
- మతిమరుపు (Alzheimer's)
- భయాందోళనలు

పిల్లల్లో సమస్యలు



- ఎదుగుదల లోపాలు
- ప్రవర్తనా లోపాలు
- మెమోరీ సమస్యలు
- ఇమ్యూనిటీ లేకపోవడం
- తరుచుగా జలుబు, జ్వరం
- అడినాయిడ్స్

Chat with Doctor @
www.drcarehomeopathy.com

టోల్ ఫ్రీ : **1800 103 1636**

~~500~~/- విలువ గల కన్సల్టేషన్ ఉచితం & మందులపై 25% డిస్కౌంట్

విజయవాడ - నక్కల్‌రోడ్ | గుంటూరు - టాలీవుడ్ థియేటర్ ఎదురుగా | నెల్లూరు - వెంకటరమణ హోటల్ ప్రక్కన | తిరుపతి - లీలా మహల్ సెంటర్ | వైజాగ్ - హోటల్ శ్రీకన్య పార్చున్ ఎదురుగా | గాజువాక - CMR సెంట్రల్ ప్రక్కన | కాకినాడ - టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా | రాజమండ్రి - ఎ.వి. అప్పారావు స్ట్రీట్ | ఏలూరు - భారత్ గ్యాస్ ఎదురుగా | అమలాపురం - బెకన్న హోటల్ దగ్గర | భీమవరం | శ్రీకాకుళం | అనంతపూర్ | కడప | కర్నూలు | ప్రొద్దుటూరు | తెలంగాణ | తమిళనాడు

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA106M114
పుస్తకం పేరు	ఈనాడు ఆదివారం
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	24
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Navya
పేజీలు విడదీసినది	Shirisha
స్కాన్ చేసినది	Navya
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good